



# విజయభాను






విశాఖపట్నం, శనివారం 03-08-2019 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 42 సంచిక : 282 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## కొత్తగా ఏడుగురికి
# క్యాబినెట్ హోదా

### సహాయ మంత్రి హోదా కల్పిస్తూ ఉత్తర్వులు ● ప్రమోషన్ ఇచ్చిన సీఎం జగన్



అమరావతి: చీఫ్ విప్ గడికోట శ్రీకాంత్‌రెడ్డికి కేబినెట్ హోదా కల్పించారు. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్‌గా ఉన్న రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డికి కేబినెట్ ర్యాంక్ కల్పించారు. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్పీ సిసోడియా నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాంత్‌రెడ్డికి ఇకపై మంత్రి హోదా దక్కుతుంది.

ఇదిలా ఉంటే మరోవైపు ప్రభుత్వ విప్‌లుగా ఉన్న ఏడుగురికి జగన్ ప్రమోషన్ ఇచ్చారు. ఏడుగురికి సహాయ మంత్రి హోదా కల్పించారు. దాడిశెట్టి రాజా, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, సామినేని ఉదయభాను, కాపు రామచంద్రారెడ్డి, కొరుముట్ల శ్రీనివాసులు, ముత్యాల నాయుడులకు ఈ హోదా దక్కింది. ఈ మేరకు సాధారణ తరువాయి 2లో..

# రికార్డు స్థాయిలో పోస్టుల భర్తీ!

- సచివాలయ పోస్టుల పరీక్ష కేంద్రాలకు కసరత్తు
- 2 లక్షల మందికి పైగా రాసే అవకాశం..
- విధులకు హాజరుకానున్న 20 వేలమంది అధికారులు, సిబ్బంది
- రవాణా ఏర్పాట్లపైనా అధికారుల దృష్టి



కృష్ణా : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు రికార్డు స్థాయిలో భర్తీ చేస్తున్న గ్రామ, వార్డు సచివాలయ పోస్టుల పరీక్షల నిర్వహణకు జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. నియామక పరీక్ష సెప్టెంబర్ 1న ఉండే అవకాశముండటంతో సమర్థంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నా తలంపుతో అధికార యంత్రాంగం పనిచేస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పరీక్షా కేంద్రాలను గుర్తించే పనిలో పడ్డారు. ప్రాథమికంగా జిల్లా వ్యాప్తంగా పరీక్షల నిర్వహణకు అన్ని వసతులు ఉన్న 497 కేంద్రాలను అధికారులు గుర్తించారు. వీటిలో అభ్యర్థులకు అవసరమైన గాలి, వెలుతురు, రవాణా సౌకర్యం తదితర అంశాలను పరీక్షిస్తున్నారు.

**2 లక్షల మందికి పైగా రాసే అవకాశం..**

భారీ స్థాయిలో నియామకాలు చేపట్టడం, గత పాలకుల నిర్వాకం వల్ల నిరుద్యోగులు పెరగటంతో సచివాలయ పోస్టులకు డిమాండ్ పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 2 లక్షలకుపైగా పరీక్ష రాసే అవకాశముందని భావిస్తున్నారు. జిల్లాలో 933 గ్రామ, 511 వార్డు సచివాలయాలకు గాను 11,025 పోస్టులను భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం గుర్తించిన 497 కేంద్రాలతో సుమారు 1.33 లక్షల మంది పరీక్ష రాసే అవకాశం ఉంది. మరో 70 వేల మందికి పైగా పరీక్షరాయనుండటంతో వారికోసం పరీక్ష కేంద్రాలను ఏర్పాటుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వాటికి తోడు మరో 200 సెంటర్లు సిద్ధం చేయటానికి జెడ్పీ సీఈఓ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు కృషి చేస్తున్నారు.

**విధులు నిర్వహించనున్న 20 వేలమంది అధికారులు, సిబ్బంది**

జిల్లా వ్యాప్తంగా 2 లక్షల మందికిపైగా నిరుద్యోగులు తరువాయి 2లో..

# అయోధ్యపై వివాదంపై విఫలమైన మధ్యవర్తిత్వం

### రోజువారీ విచారణ చేపడతాం
### సుప్రీం స్పష్టీకరణ

దిల్లీ: అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ జరిగింది. ఈ వివాదంపై వాదులు, ప్రతివాదుల మధ్య సయోధ్య కుదిర్చేందుకు ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వ కమిటీ విఫలమైందని అత్యున్నత న్యాయస్థానం అభిప్రాయపడింది. దాదాపు నాలుగున్నర నెలల పాటు శ్రమించిన కమిటీ హిందూ-ముస్లిం వర్గాలతో విస్తృత సంప్రదింపులు జరిపినా.. ఇరు వర్గాలకీ ఆమోదయోగ్యమైన పరిష్కారం సూచించడంలో విఫలమైందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో ఆగస్టు 6 నుంచి తామే రోజువారీ విచారణ చేపడతామని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. అయోధ్య వివాదంలో సామరస్యపూర్వకంగా సమస్యను తరువాయి 2లో..



# ఎంపీ విజయసాయిరెడ్డికి అభినందనల వెల్లువ

విశాఖపట్నం: శుక్రవారం గౌరవ రాజ్యసభ ఎంపీ మరియు వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి. విజయసాయిరెడ్డిని విశాఖ నగర వైసీపీ అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ విశాఖ ఎయిర్ పోర్ట్‌లో ఘన స్వాగతం పలికారు. పార్టీ పెద్దలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,





వివిధ నియోజకవర్గ ఇంచార్జిలు, వైసీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్ళడంతో పండుగ వాతావరణం తలపించింది. అనంతరం రాష్ట్ర పశు సంవర్ధక మత్స్య శాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణకు ఎయిర్‌పోర్ట్ లో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలకు ట్రైన్‌లో పింక్ కోచ్

న్యూఢిల్లీ : మహిళలకు ఏర్పాటు చేసే ప్రత్యేకమైన కోచ్‌లు పింక్ రంగులో ఉంటాయి. బోగీలపై పింక్ కలర్ లైన్ కనిపిస్తుంది. ప్రస్తుతం ఢిల్లీ మెట్రోలో.. ప్రతి రైలులో ఒక కోచ్ మహిళల కోసం కేటాయించిన విషయం తెలిసిందే. మహిళల కోసం కేటాయించిన పింక్ బోగీల్లో మహిళలు, చిన్న పిల్లలు ఎక్కవచ్చు. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ జోన్ ఇప్పటికే ఈ విధానాన్ని అనుసరిస్తోంది. ఎన్‌ఎఫ్ఆర్ దాదాపు ఆరు ప్యాసింజర్ రైళ్లు, ఎల్ఎల్ఆర్ కోచ్‌లకు పింక్ రంగు వేసింది. వాటిలో కేవలం మహిళలు, పిల్లలు మాత్రమే ప్రయాణించాలి. తరువాయి 2లో..

# గాంధీ, నిమ్స్‌లో జూడాల నిరసన




హైదరాబాద్: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లులో అభ్యంతరకరంగా ఉన్న సెక్షన్ 32, సెక్షన్ 50లను తొలగించటం సహా తమ డిమాండ్లను పూర్తి చేసే వరకు విధులకు హాజరుకాబోమని తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం స్పష్టం చేసింది. ఎన్ఎంసీ బిల్లుకు వ్యతిరేకంగా గాంధీ ఆస్పత్రిలో జూనియర్ డాక్టర్లు చేస్తున్న నిరసనలు మూడోరోజూ కొనసాగాయి. వెయ్యి మందికి పైగా జూడాలు సమ్మెలో పాల్గొంటున్నారు.

మరోవైపు నిమ్స్ ఆస్పత్రిలో జూడాలు ఓపీ సేవలను బహిష్కరించారు. ఎన్ఎంసీ బిల్లు పేద విద్యార్థులు, రోగులకు వ్యతిరేకంగా ఉందని.. తక్షణమే బిల్లులో ప్రతిపాదించిన విషయాలపై ప్రభుత్వం పునఃసమీక్ష చేసి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి నిమ్స్ రెసిడెంట్ వైద్యుల బృందం ధర్నాచేపట్టింది. బిల్లుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆస్పత్రి ప్రాంగణంలో ర్యాలీ చేపట్టారు. బిల్లుకు సంబంధించి రెసిడెంట్ వైద్యుల తరపున కేంద్ర ప్రభుత్వానికి తరువాయి 2లో..






## శ్రీవారికి జూలైలో రికార్డు స్థాయి ఆదాయం

### వందకోట్లు దాటడం ఇది మూడోసారి



తిరుమల: కలియుగ వైకుంఠం తిరుమల శ్రీవారికి జులైలో రికార్డులో స్థాయిలో ఆదాయం సమకూరింది. హుండీతో పాటు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా జులైలో రూ.106.28 కోట్ల ఆదాయం సమకూరినట్లు తితిదే వెల్లడించింది. ఈ ఏడాదిలో హుండీ ఆదాయం రూ.100 కోట్లు దాటడం ఇది మూడోసారి. మార్చిలో రూ.105.8 కోట్లు, జూన్‌లో రూ.100 తరువాయి 2లో..




# అంగన్వాడీ ఉద్యోగం ప్రజలకు సేవ చేయడానికి అవకాశం

### పెందుర్తి సూపర్‌వైజర్ శ్యామల వివరణ



పెందుర్తి : ప్రజలకు సేవ చేసేందుకే అంగన్వాడీ ఉద్యోగం వచ్చిందని కార్యకర్తలు, ఆయాలు భావించాలని పెందుర్తి సెక్టారు సూపర్‌వైజర్ ఎ.శ్యామల పేర్కొన్నారు. శుక్రవారం సెక్టార్‌లోని శైలజ అంగన్వాడీ సెంటర్‌లోని ఆయా ఉద్యోగ విరమణ సంద ర్భంగా ఆమె మాట్లాడారు. ఎంతో మంది భావి భారత పౌరులను తీర్చిదిద్దే భాగ్యం అంగన్వాడీలకే దక్కు తుందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ లీడర్ ఆర్.అనితతో పాటు ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేడిపేట ఏఎస్సైగా రంగారావు



గొలుగొండ : కేడిపేట ఏఎస్సైగా ఎల్.రంగారావు శుక్రవారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ హెచ్‌సిగా పని చేసిన ఆయన పదోన్నతిపై ఏఎస్సైగా జిల్లా ఉన్నతా ధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిఐ ఉదయ్ కుమార్, కేడిపేట ఎస్సై సిహెచ్.భీమ రాజు తదితరులు రంగా రావుకు అభి నందనలు తెలిపారు.

### స్వయంభూ విఘ్నేశ్వర ఆలయంలో

# మండల దీక్షలు ప్రారంభం



చోడవరంలో గణేష్ మాలధారణ స్వీకరిస్తున్న భక్తులు

చోడవరం : రాష్ట్రంలో మరో కానిపాకంగా విరాజిల్లుతున్న విశాఖ జిల్లా చోడవరం పట్టణంలో వేంచేసి ఉన్న స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయంలో మండల దీక్ష కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు కార్యసిద్ధి విఘ్నేశ్వరస్వామిని ధరించి, అనంతరం మాలధారణ స్వీకరిస్తున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్, చలపతి తదితరులు మాలధారులకు దీక్షదారణ చేసి అనంతరం స్వామి వారి దర్శనం కల్పించి ప్రసాద వితరణ చేపట్టారు.

## మొదటి పేజీ తరువాయి

# కొత్తగా ఏడుగురికి క్యాబినెట్ హోదా

పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఏడగురిలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పిన్నెల్లి, రామకృష్ణారెడ్డి, సామినేని ఉదయభాను, కొరుముట్ల శ్రీనివాసులు మంత్రి పదవులు ఆశించారు. కానీ వారికి ఆ అవకాశం దక్కలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి జగన్ సహాయ మంత్రి హోదా కల్పించి.. వారి కలను ఇలా నెరవేర్చారు. అయితే వీరికి కేబినెట్ మంత్రుల హోదా ఉంటుందా? లేదా? అన్నది స్పష్టత రావాల్సి ఉంది.

# రికార్డు స్థాయిలో పోస్టుల భర్తీ!

పరీక్ష రాయనుండటం సుమారు 700 దాకా పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయటంతో అంతే స్థాయిలో అధికారులు, సిబ్బంది అవసరమవుతారు. ఇందుకోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఇతర అధికారులను విధుల్లోకి తీసుకోనున్నారు. పరీక్షా కేంద్రంలో ప్రతి గదికీ ఓ ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్, రూట్ అధికారులు పనిచేయనున్నారు. అలాగే భద్రతా పరమైన ఏర్పాట్లకు పెద్ద ఎత్తున పోలీసు సిబ్బంది అవసరం కానున్నారు. ముఖ్య పట్టణాలతో పాటు చిన్న నగరాల్లో కూడా పరీక్ష నిర్వహించనుండడంతో రవాణా ఏర్పాట్లపైనా అధికారులు దృష్టిపెడుతున్నారు.

# అయోధ్యపై వివాదంపై విఫలమైన మధ్యవర్తిత్వం

పరిష్కరించడానికి అవకాశముంటే సూచించాలని ఈ ఏడాది మార్చి 8న సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ జడ్జి ఎఫ్.ఎం.ఖలీఫుల్లా, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు శ్రీశ్రీ రవిశంకర్, ప్రముఖ సీనియర్ న్యాయవాది శ్రీరామ్ పంచు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. అయితే మధ్యవర్తిత్వ ప్రక్రియలో పురోగతి చోటుచేసుకోవడం లేదని, దాన్ని రద్దు చేసి న్యాయస్థానమే విచారణ జరపాలని కోరుతూ సర్వోన్నత న్యాయస్థానంలో కొద్దిరోజుల క్రితం పిటిషన్ దాఖలైంది. కోర్టు ఆదేశాల ప్రకారం కమిటీ పురోగతి నివేదిక అందించింది. దీన్ని పరిశీలించిన ధర్మాసనం.. జులై 31 వరకు మధ్యవర్తిత్వం కొనసాగించి ఆగస్టు 1న నివేదిక ఇవ్వాలని సూచించింది. దీంతో జస్టిస్ ఖలీఫుల్లా నేతృత్వంలోని కమిటీ గురువారం నివేదికను సీల్డ్ కవర్‌లో సమర్పించింది. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం.. అయోధ్య అంశంలో సామరస్యానికి మధ్యవర్తిత్వ కమిటీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని అభిప్రాయపడింది. దీంతో ఈ నెల 6 నుంచి తామే రోజువారీ విచారణ చేపడతామని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.

# గాంధీ, నిమ్స్‌లో జూడాల నిరసన

ఓ నివేదిక అందిచనున్నట్టు జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. జూడాల సమ్మెతో రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

# మహిళలకు ట్రైన్‌లో పింక్ కోచ్

మహిళా ప్రయాణీకుల భద్రత కోసం మెట్రో దారిలోనే నడుస్తామని, వారికి ప్రత్యేకమైన బోగీలను ఎక్కువగా ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్ఎఫ్ఆర్ ఇప్పటికే ఈ విధానాన్ని ప్రారంభించింది.. త్వరలోనే ఇతర రైళ్లకూ దీన్ని వర్తింపజేస్తామని ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

# శ్రీవారికి జూలైలో రికార్డు స్థాయి ఆదాయం

కోట్ల మేర ఆదాయం లభించింది. ఈ ఏడాది చివరి నాటికి శ్రీవారి హుండీ ద్వారా రూ.1,234 కోట్ల ఆదాయం లభిస్తుందని తితిదే అంచనా వేస్తోంది.

# వ్యాధులు సోకకుండా గృహిణులు జాగ్రత్త వహించాలి

### ఇంటింటా లార్వా గుర్తింపు.. ముమ్మరంగా శానిటేషన్ పనులు



నర్సీపట్నంలో లార్వాను గుర్తిస్తున్న జయకుమార్ బృందం



ధర్మసాగరంలో మురుగును తొలగిస్తున్న దృశ్యం

నర్సీపట్నం : ధర్మసాగరం గ్రామంలో శానిటేషన్ పనులు ముమ్మరం చేశామని పంచా యతీ కార్యదర్శి శేఖర్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికి తిరిగి లార్వా గుర్తింపు, తొలగింపు కార్యక్రమాన్ని ఆరోగ్య సిబ్బంది జయ కుమార్ తెలిపారు. మండలంలోని 9 పంచా యతీల్లోను పలువురు కార్యదర్శులు ఇప్పటికే శానిటేషన్ పనులు ప్రారంభించారు. నిధులు లేకపోయినా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడుతున్నామన్నారు.

### వాలంటరీ నియామకాల్లో

# రాజకీయ జోక్యం తగదు



మాట్లాడుతున్న సీపీఐ మండల కార్యదర్శి అజయ్‌బాబు

నాతవరం : వాలంటరీ నియామకాలకు సంబంధించి రాజకీయ జోక్యం తగదని సిపిఐ మండల కార్యదర్శి డి.అజయ్‌బాబు ఆరోపించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాజకీయం చేసి అర్హులను అనర్హులుగా చూపడం సరైంది కాదన్నాఉ. ముఖ్య మంత్రి వైయస్.జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వాలంటీర్ల నియామకానికి 10వ తరగతి, ఇంటర్ చదువుకున్న 50 ఇళ్లకు ఒక వాలంటీర్లకు గాన కుటుంబం ప్రతిపాదికన నిర్ణయించారన్నారు. నాతవరం మండలంలో దీనికి వ్యతిరేకంగా జరుగుతుందన్నారు. పకడ్బందీగా ప్రవేశపెట్టిన ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చేటప్పుడు రాజకీయం చేసి అనర్హులను అర్హులుగా చేసి ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రయత్నించడం సరైన పద్ధతి కాదన్నారు.

పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని చెబు తున్నారే కానీ ఆచరణలో మాత్రం అమలు కావడం లేదన్నారు.

వాలంటీర్ల నియామకాల్లో రాజకీయ ప్రదర్శించినట్లు అయితే గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలకు, దీనికి పెద్ద తేడా ఉండదని ఆయన చెప్పారు. ఈ విషయమై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టిసారించి రాజకీయం లేకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త మనోహర్, ప్రభుదాస్ పాల్గొన్నారు.

# వీ టీమ్‌కు స్వరచక్రవర్తి జాతీయ పురస్కారం

### కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి జయసుధ ప్రత్యేక అభినందనలు




విశాఖపట్నం : తెలుగు సినీ సంగీత చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పర్చుకున్న స్వరచక్రవర్తి జయంతి సందర్భంగా ప్రతి ఏటా ఒక్కో సంగీత దిగ్గజానికి నబశ్;స్వర చక్రవర్తి జాతీయ పురస్కారం అందచేయ నున్నట్టు వీ టీమ్ చైర్మన్ వీరుమామ తెలిపారు. ఈ సంవత్సరం నుండి మొదలు పెడ్తున్న ఈ కార్యక్రమం సంగీత దర్శకులు కోటి సహకారంతో చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ సింగర్ బేబీ మొదటిసారి విశాఖ విచ్చేసి అందరిని అలరిస్తారని సుమారు 10 మంది సినీ నేపధ్య గాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని , సెప్టెంబర్ 7న గురజాడ కళాక్షేత్రంలో కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమానికి జయసుధ ప్రత్యేక అభినందనలు తెలిపి సింగర్ మనోకి ఈ పురస్కారం రావడం అభినందనీయం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వీ టీమ్ ఈవెంట్స్ చీఫ్ ఉదయా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థులకు సదుపాయాలు కల్పించండి

పెద్దాపురం : సంక్షేమల వసతి గృహాలలో పేద విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సదుపాయాలు పూర్తి స్థాయిలో అందించే బాద్యలో హాస్టల్ వార్డెన్లు,ప్రిన్సిపాల్ లపై వుందని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు.

శుక్రవారం పట్టణంలోని సుధా కాలనీలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల,ఎస్సీ బాలుర వసతి గృహం, ఎస్సి బాలుర కాలేజీ హాస్టల్ ను ఎమ్మెల్యే చినరాజప్ప తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా సంక్షేమ హాస్టళ్ల భవనాలు, విద్యార్థుల తరగతి,విశ్రాంతిగదులు, మరుగుదొడ్లు, వంటశా, పారిశుద్ధ్యం, విద్యార్థులకు తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిం చారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని హాస్టల్ అధికారులతో తెలిపారు. హాస్టల్ లో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా వాతా వరణాన్ని ఆహ్లాదకరంగా ఉంచాలని వార్డెన్లకు సూచించారు. అనంతరం స్థానిక పాల ఆర్డీవో కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్డీవో కార్యాలయం భవన నిర్మాణ పనులను, నూతన తహశీల్దార్ కార్యాలయ పనులను పరిశీలించి సంబంధిత ఆర్‌బి అధికారులు, కాంట్రాక్టర్లకు త్వరితగతిన భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్.మల్లిబాబు, తహసీల్దార్ పద్మావతి,ఎఎస్ డబ్ల్యూఓ టి.గాయత్రి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎర్నెస్ట్.ఆర్‌బి డిఇఇ ఎఎస్ఎస్ ప్రకాశరావు, ఆర్డీవో కార్యాలయం ఏవో చిన్నారావు,డిప్యూటీ తహశీల్దార్ కృష్ణారావు,ఆర్ఐ గవితేజ,వార్డెన్ రామలింగేశ్వర రావు,తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలపై వివరిస్తున్న సిడిపిఒ శాంతిప్రియ

# కిశోర దశ నుంచే పౌష్టికాహారం తీసుకోవాలి

నాతవరం : కిశోర దశ నుంచే పౌష్టికాహారం తీసుకోవాలని సిడిపిఒ శాంతిప్రియ అన్నారు. శుక్రవారం నాతవరం మండలం మర్రిపాలెం కెజిబివిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ శాంతిప్రియ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కిశోర దశ నుంచి పిల్లలు మంచి పౌష్టికాహారం తీసుకుంటేనే అన్ని రంగాల్లోను ముందంజలో ఉంటారని, వారు నేర్చుకున్న విషయాలు అందరితో పుంజుకుంటారని, అన్ని విషయాల్లో అవగాహన కలిగి మంచి భవితకు పునాది వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాతవరం మండల సూపర్‌వైజర్లు కె.విజయకుమారి, పివి.రాఘవుల, ఎస్ఒ వి.శాంతి, ఎఎన్ఎం బి.పద్మ, కేజిబివి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వాలెంటర్లుకు అర్హతపత్రాలు అందజేత

### ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే అదీప్‌రాజు



పరవాడ:పరవాడమండలములో 279మంది వాలెంటర్లుకు అర్హతపత్రాలును శుక్రవారము స్దానిక ఎమ్మేల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ చేతులుమీదగా పంపిణీ చేసారు.అనంతరము అయన మాట్లడుతూ ముఖ్యమంత్రిజగన్ మొహన్ రెడ్డి మహిళలుకే పెద్దపీటవేసారు అనిఅన్నారు. వాలెంటర్లులో మహిళలు అదికముఅని అన్నారు. రాజకీయాలుకు అతీతింగా సంక్షేమ పథకాలు ప్రజలుఅందరికీ అందజేసే విధంగా వాలెంటర్లీ పనిచేయాలనీ అన్నారు. ఈకార్యక్రమంలో రాష్టవైసిపి సిఇసి సభ్యులు పైలశ్రీనువాసురావు,మండలపార్టి ప్రెసిడెంట్ సిరపురపు అప్పలనాయుడు, జిల్లాప్రదానకార్యదర్శి చుక్కరామునాయుడు, అహారభద్రతసలహామండలి సభ్యులు పైలసన్యాశిరాజు,ఎమ్ అర్ ఒ గంగాదర్ రావు, ఎమ్ డిఒ కరుణకుమారి, పంచాయితీ విస్తరణాఅదికారి పద్మజ,స్దానికవైసిపి నాయకులు గెడ్డంఉామ, యూత్ ప్రెసిడెంట్ పెదిశెట్టిశేఖర్ ,బండారురామారావు,బురద రాజు ,బొద్దపుచిన్నారావు,వెన్నెలసన్యాశిరావు,తథితర్లు పోల్గోన్నారు.

# గ్రామ సచివాలయ ఉద్యోగాలపై నిరుద్యోగులకు ఉచిత శిక్షణకు విశేష స్పందన

- లక్ష్యాలు నిర్దేశించుకుని వైఫల్యాలు అధిగమించండి
- శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రామ్ నరేష్ బిర్లంగి

చోడవరం : జిల్లాలోని త్వరలో భర్తీ కానున్న గ్రామ, వార్డులలో సచివాలయాల ఉద్యోగ నియమకాలపై గ్రామీణ ప్రాంత అభ్యర్థులకు చోడవరం పట్టణం ప్రేమ సమాజంలో ప్రారంభమైన ఉచిత శిక్షణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఫారెస్ట్ అధికారి రామ్ నరేష్ నేత్రుత్వంలో ,ఫోరం ఫర్ బెటర్ చోడవరం సహకారంతో చేపడుతున్న శిక్షణా కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమానికి వచ్చిన అభ్యర్థులకు రామ్ నరేష్ ముఖ్యఅతిధిగా పాల్గొని దిశా నిర్దేశ్యం చేశారు. అభ్యర్థులు ముఖ్యంగా సిలబస్ ప్రాధాన్యత అంశాలపై దృష్టిసారించాలని, లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా చదవడం ద్వారా విజయం సాధించవచ్చన్నారు. పరీక్షలకు కొద్దిరోజులే సమయం ఉండటంతో కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నెల 2 నుంచి 28 వరకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో నిష్ణాతులైన ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ పోటీ పరీక్షల కోచింగ్ నిర్వాహకులు, ప్రాంతీయ అనుభవజ్ఞులు, పాల్గొని శిక్షణ ఇవ్వనున్నారన్నారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎలాంటి ఖర్చు లేకుండా ఉచితంగా శిక్షణ నిచ్చి ప్రోత్సహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లాలోని ఏ ప్రాంతం నుంచైనా ఉచిత శిక్షణ వినియోగించుకోవచ్చని అభ్యర్థులు ఆధార్ కార్డు వెంట తీసుకువచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రోగ్రామ్ కన్వీనర్ బలరాం మొబైల్ నెంబరు 9553893919 ను సంప్రదించాలన్నారు. కాగా శిక్షణా కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు ఎక్సైజ్ డిపార్టు మెంట్‌లో పనిచేస్తూ ఇటీవల నిర్వహించిన డి.ఎస్.సి, స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్సు పరీక్షలో టాపర్‌గా నిలచిన ఎన్ క్రిష్ణ పాల్గొని శిక్షణలో పాల్గొన అభ్యర్థులకు పలు ప్రాధాన్యత అంశాలపై కూలంకషంగా వివరించారు.

ఈ కార్యక్రమంలో ఆర్క్ ప్రసాద్, రిటైర్డు అధ్యాపకులు ఎన్. దేముడు, ప్రేమ సమాజం రాజు,పోస్టల్ క్రిష్ణ, జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలి

అచ్యుతాపురం : కేంద్ర ప్రభుత్వం రూపొందిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు . శుక్రవారం మండల కేంద్రమైన అచ్యుతాపురం లో సిఐటియు అధ్వర్యంలో నిరసన తెలియజేశారు .

# గ్రామ వాలంటీర్ల సర్వీసు పారదర్శకతతో ఉండాలి

- అవినీతిలేని పాలనే ప్రభుత్వ ధ్యేయం
- సంక్షేమ పథకాలు పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలందరికి అందాలి
- జిల్లా స్థాయి టి.ఓ.టి.శిక్షణా కార్యక్రమంలో వెల్లడించిన రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు



విశాఖపట్నంః గ్రామ వాలంటీర్ల సర్వీసు పారదర్శకతతో ఉండాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు క్రీడలు, యువజన సర్వీసుల శాఖామాత్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెందుర్తిలోని డి.ఆర్.డి.ఎ. మహిళా శిక్షణా ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రెండు రోజుల గ్రామ వాలంటీర్ల శిక్షణకై జిల్లా స్థాయి టి.ఓ.టి. శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు అవినీతి లేకుండా సర్వీసు అందించాలన్నారు వాలంటీర్లకు కేటాయించిన 50 గృహాలలోని కుల, మతాలు బేధాలు లేకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతీ పేద వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని చెప్పారు. సమాజం పట్ల సేవా భావం కలిగి, వాలంటీర్ కు కేటాయించబడిన 50 కుటుంబాలకు ప్రభుత్వ కార్యక్రమాల పట్ల అవగాహన కల్పించాలని, సంక్షేమ పథకాల సమాచారాన్ని వాటి ప్రయోజనాలను ప్రజల ఇంటి ముంగిట అందించాలన్నారు. వారి సమస్యలను ఎప్పటికప్పుడు గ్రామ సచివాలయంలో వివిధ శాఖల ప్రతినిధులకు చేరవేస్తూ, ఆయా సమస్యల పరిష్కారానికి అవసరమైన సేవలను సమర్థవంతంగా అందించాలని పేర్కొన్నారు. గ్రామ వాలంటీర్ అవినీతికి పాల్పడితే జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూం ద్వారా కలెక్టర్ కు తెలియజేయాలని, అక్కడ న్యాయం జరగగపోతే రాష్ట్ర స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెల్లాలన్నారు. ప్రజలకు పారదర్శకమైన, అవినీతిలేని పాలన అందించడానికి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ముఖ్యమంత్రి గ్రామ వాలంటీర్లను నియమించినట్లు వివరించారు. అంతకుముందు పెందుర్తి, భీమునిపట్నం ఎంపిడిఓలతో గ్రామవాలంటీర్ల పాత్ర వారు నిర్వహించే విధులపై వారిని అడిగి తెలుసుకున్నారు. పెందుర్తి శాసన సభ్యులు అదీప్ రాజు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రామ వాలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేయాలని, ఉపాధ్యాయులు గ్రామ వాలంటీర్లకు దిశా నిర్దేశం చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్-2 ఎం. వెకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉండాలన్నారు. జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. రమణమూర్తి మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు గ్రామాల అభివృద్ధిలో ప్రముఖపాత్ర వహించాలన్నారు. అందకు ముందు జ్యోతి వెలిగించి శిక్షణా కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం గ్రామ వాలంటీర్ల శిక్షణా కరదీపిక, నవరత్న మాలిక కరదీకను మంత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్-2 ఎం. వెంకటేశ్వరరావు, జడ్పి సిఇఓ రమణమూర్తి, డిపిఓ కృష్ణకుమారి, జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి తిరుపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు జయప్రకాష్, డిఇఓ లింగేశ్వర్ రెడ్డి, డిఆర్డిఎ ఇన్ చార్జ్ పిడి రామమోహన్ రావు, ఆయా మండలాల ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.



బార్ కౌన్సిల్ మెంబర్, సీనియర్ న్యాయవాది బైపా అరుణ్ కుమార్ జన్మదిన సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లాయర్ల ఆఫీసులో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు

# తల్లిపాలే బిడ్డలకు శ్రీరామ రక్ష

## ఆరిలోవ గాంధీనగర్ సెంటర్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



విశాఖపట్నంః పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రీరామ రక్ష అని అంగన్‌వాడీ బి.శ్యామలాదేవి అన్నారు. బిడ్డకు తల్లిపాలు పుట్టినప్పటి నుంచి ఆరునెలల పాటు ప్రతీరోజూ పూర్తిస్థాయిలో పెట్టడం వలన బిడ్డకి రోగనిరోధక శక్తి పెరిగి బిడ్డ ఎదుగుదలకు కారణం అవుతుందని తల్లులకి వివరించారు. విశాఖలోని ఆరిలోవ గాంధీనగర్ సెంట్ లోని తల్లులకు తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బాలింతలు, గర్భిణీలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో కూడా వారికి చక్కగా వివరించారు. గాంధీనగర్, శ్రీరామ్ నగర్ పరిధిలోని సుమారు పది మంది అంగన్‌వాడీలు తల్లులను కేంద్రాలకి తీసుకు వచ్చి పిల్లలకు ఏవిధంగా సంరక్షణ చేయాలో వివరించారు.

అంతేకాకుండా తినే ఆహారంలో ఏఏ పోషకాలు పిల్లలకు పాల ద్వారా అందుతాయో కూడా అక్కడ గిన్నెల్లో పోసి మరీ వివరించారు. అంతేకాకుండి పుట్టిన బిడ్డ దగ్గర నుంచి ఆరు నెలల బిడ్డ వరకూ పాలు తాగిన తరువాత, వాటి అరుగుదలకు బిడ్డను ఏ విధంగా భుజంపై వేసుకోవాలో కూడా ఓ బొమ్మ సహాయంతో అంగన్‌వాడీలు వివరించారు.

ఐసిడిఎస్ సిడిపిఓ పద్మావతి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో తల్లులు తమ పిల్లలకు తల్లిపాల వలన కలిగే లాభాలను, బిడ్డ ఎదుగుదలకు పాటించాల్సిన సూటనలు అంగన్‌వాడీల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒక్కో తల్లికి, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని కార్యకర్తలు, వారి బరువు, బిడ్డ బరువు, ఏ నెలకు ఎంత బరువు వుండాలి అనే అంశాలను విపులంగా తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు బి.శ్యామలాదేవి, కె.రమాదేవి, ఎస్.నాగమణి, ఎస్.రమాదేవి, ఆర్.విమల, పి.దేవి, ధనలక్ష్మి, అనిత, సంధ్య, ధరణి తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు తల్లులు, బాలింతలు, గర్భిణీలకు ప్రభుత్వం అందజేసిన బలవర్ధక ఆహారాన్ని అందజేశారు.

## డయల్ యువర్ యూనివర్సిటీ నిర్వహణ



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శుక్రవారం ఉదయం డయల్ యువర్ యూనివర్సిటీ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల సందేహాలకు ఏయూ రెక్టార్ ఆచార్య ఎం.ప్రసాద రావు సమాధనమిచ్చారు. మెత్తం 21 మంది ఫోన్ ద్వారా తమ సందేహాలను, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలు తదితర అంశాలపై విద్యార్థులు సమాచారం కోరడం జరిగింది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.క్రిష్ణమోహన్, డీన్‌లు జగన్నాధ రావు, దూరవిద్య సంచాలకులు ఆచార్య పి.హరిప్రకాష్, ప్రవేశాల సంచాలకులు ఆచార్య నాయుడు, సిడిసి డీన్ ఆచార్య సి.హెచ్ పాండు రంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు రీ వేల్యుయేషన్ ఫలితాలు విడుదల

## అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు



ఆంధ్ర విశ్వకళాపరిషత్ః ఆంధ్రవిశ్వదవిద్యాలయంలో రీ వేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసిన విద్యార్థుల జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ పూర్తయిందని ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య కె.వెంకట రావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ఫలితాలను ఏయూ వెబ్‌సైట్‌లో ఉంచడం జరుగుతుందన్నారు. రీ వేల్యుయేషన్‌లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల మార్కులు వెబ్‌సైట్‌లో తెలియజేస్తామన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు నేరుగా వర్సిటీకి వచ్చి మార్కుల జాబితాలు పొందవలసి ఉంటుందన్నారు. ఇప్పటికే రీ వేల్యుయేషన్‌కు దరఖాస్తు చేసి, ఫలితాలు రానివారు, రీ వేల్యుయేషన్ పరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా వెంటనే తనను సంప్రదించాలని సూచించారు.

## దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ చేపట్టిన పనులపై

# సిట్ విచారణ చేపట్టాలి



సింహాచలం: 72వ వార్డు పరిధి సింహాచలం స్థానిక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ జిల్లా అర్బన్ ఉపాధ్యక్షుడు, మాజీ ట్రస్టు బోర్డు మెంబర్ పాశర్ల ప్రసాద్ దేవస్థానం పనుల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న పరిణామాలు నేపథ్యంలో దేవస్థానం ఇంజనీరింగ్ శాఖ మరియు అధికారులపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ శాఖ అధికారులకు ఎంత చెపుతున్నా కనీస రక్షణ చర్యలు చేపట్టకుండా కొండను పురాతన పద్దతిలో బాంబులు పేల్చి అటు ఆలయానికి ఇటు భక్తులకు గ్రామప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వీళ్ళ నిర్వాకం వలన మహిళా భక్తురాలు ప్రాణాలు కోల్పోగా, మరొకరు ఆసుపత్రి పాలయ్యారని వీళ్లకు పరిహారం దేవుడు డబ్బుతో చేస్తున్నారని, వీళ్ల నిర్వాకం వలన కొండపైన శతాబ్దాలుగా పారుతన్న సహజ ధారలు గంగాధర, ఆకాశధార, వేగావతి, హనుమత్ ధార, స్వామి వంటశాలలో వచ్చే నాగధార కూడా వీరి పనుల వలన కనుమరుగయ్యిందని ధ్వజమెత్తారు. 8 కోట్ల రూపాయలతో చేపట్టిన మెట్లవిస్తరణ ప్రణాళికలు లేకుండా లోయలో విరుద్ధంగా జరుపుతున్నారని, దీనివలన సహజ సిద్ధమైన హనుమంతుని ఆలయం దెబ్బతింటుందని, స్వామివారి భూములు కాపాడటనికి కొండచుట్టూ కట్టిన గోడ నాణ్యత లేకుండా కట్టారని, గోడ కట్టిన తరువాత 5 వేల అక్రమ నిర్మాణాలు వెలిశాయని, కొండపైకి రెండవ ఘాట్ రోడ్డు నిర్మించకుండా సింహం ఆకారంలో ఉన్న కొండను పగలుకొట్టి ఇష్టానుసారంగా పనులు చేపట్టి భక్తుల ప్రాణాలు తీసేస్తున్నారని, జగదాంబ సెంటర్‌లో ఎంతో విలువైన పి పి హాల్ అభివృద్ధి చేస్తే అప్పన్నకు లక్షలలో ఆదాయం వస్తుందని, దాన్ని వేరొకరికి ధారాదత్తం చేశారని ఇలా ఎంతోసొమ్ము అప్పన్న ఖజానాకు నష్టం కల్గిస్తూ కాసులు కమీషన్లకు అలవాటు పడిన వీరిపై అవినీతిరహిత పాలన అంటున్న జగన్ మరియు అవంతీ సిట్ వేసి విచారణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పిసిని వరహనరసింహం, లండ శ్రీను, పాలవలస ఈశ్వరరావు, తదితర నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాల్లో మరో నాలుగు రోజులు వర్షాలే!

హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తున్నాయని.. మరో నాలుగైదు రోజుల పాటు తేలికపాటి వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురవగా.. ఒకట్రెండు చోట్ల భారీ వర్షం పడిందని వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు. శనివారం ఒకట్రెండు చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురవనున్నాయని వెల్లడించారు. ఆదివారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీంతో పాటు ఈ నెల 4న ఈశాన్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇది మరింత తీవ్రంగా మారి పశ్చిమ దిశగా పయనిస్తే మాత్రం దీని ప్రభావం తెలుగు రాష్ట్రాలపై ఎక్కువగానే ఉంటుందన్నారు.

# 41వ వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు

- తుమ్మడపాలెం, మర్రిపాలెంలలో పర్యటన
- లార్వాలు లేకుండా జల్లెడ పట్టండి
- యుజిడి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించండి
- స్వచ్ఛ విశాఖ ద్వార వ్యాధిరహిత నగరంగా విశాఖపట్నం
- అందరు సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించండి
- జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: జివియంసి నాలుగవ జోన్ 41 వ వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ డా.జి.సృజన పేర్కోన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా శుక్రవారం ఆమె తుమ్మడిపాలెం, సదరం రామునాయుడు కాలనీలలో పర్యటించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మలేరియా సిబ్బంది నిర్వహిస్తున్న ఏంటి లార్వెల్ ఆపరేషన్స్‌ను పరిశీలించారు. ప్రతి మలేరియా వర్కర్ 50 నుండి 60 గృహాలను సందర్శించి ప్రజలను చైతన్యవంతం చేయాలని, దోమల ఉత్పత్తి, వ్యాప్తి నిరోధానికి సన్నద్ధం చేయాలని కోరారు. ప్రతి ఇంటిలో లార్వాలు లేకుండా చూడాలని పేర్కోన్నారు. యుజిడి సమస్య ఉందని చెప్పగా సత్వరం ఆ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని జోనల్ కమిషనర్ సింహాచలంను ఆదేశించారు. తడి-పొడి చెత్తను వేరుచేసి కార్మికులకు అందజేయాలని పేర్కోన్నారు. చెత్తను రోడ్డు ప్రక్కన పోగులుగా వేయడాన్ని గమనించి ఆ గృహస్తును పిలిచి చెత్తను కార్మికులకు అందజేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని స్థానికులను ప్రశ్నించగా ఏ సమస్యలు లేవని తెలిపారు. స్వచ్ఛ విశాఖ ద్వార వ్యాధిరహిత నగరంగా తీర్చిదిద్దాలని అభిలషించారు. అందరు సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వర్తించడం ద్వార స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంక్ సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. పర్యటనలో జోనల్ కమిషనర్ సింహాచలం, ఏ.యం.ఓ.హెచ్ డా.రాజేష్, ఇ.ఇ చిరంజీవి, మలేరియా సిబ్బంది పాల్గోన్నారు.

# దివ్యాంగులకు గీతం రోటరాక్ట్ క్లబ్ సహాయ హస్తం



సాగర్‌నగర్ః గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ విద్యార్థులు సభ్యులుగా గల రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ గీతం ఆద్వర్యంలో దివ్యాంగులు, అనాధ బాలల సహాయార్ధం శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్ధులు అధికంగా కొనుగోలు చేసే ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను వివిధ రూపాలలో దివ్యాంగ విద్యార్థులతో తయారు చేయించిన రోటరాక్ట్ క్లబ్ సభ్యులు వాటిని గీతం ప్రాంగణంలో విక్రయించనున్నారు.

తద్వారా చేకూరే మొత్తాన్ని దివ్యాంగులు, అనాధ బాలల అవసరాలకు అందించాలన్నది తమ ప్రధాన ఉద్దేశ్యమని ఫాకల్టీ సలహాదారు మురళీకృష్ణ తెలిపారు. కాగా ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌ల విక్రయాల కోసం గీతం విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ, విద్యార్థి వ్యవహారాల డైరక్టర్ ప్రొఫెసర్ కె.వీరభద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ గీతం అద్యక్షుడు ప్రేమ్‌సింగ్, కార్యదర్శి సృజన్ తదితరులు పాల్గోన్నారు.

## మోడీ, జగన్ అనైతిక పొత్తు

# రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం

## సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్



విశాఖపట్నంః ప్రధాని నరేంద్ర మోడీ, ఎపి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అనైతిక పొత్తు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తోందని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకారత్ అన్నారు. పార్లమెంట్‌లో వైసిపి అనుసరిస్తున్న తీరు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉందన్నారు. స్థానిక పబ్లిక్ లైబ్రరీలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎపికి ప్రత్యేక హెూదా ఇచ్చే ప్రసక్తే లేదంటూ కేంద్రంలోని బిజెపి తేల్చిచెప్పినప్పటికీ ప్రతిపక్ష హెూదాలో పోరాడిన వైసిపి పార్లమెంట్‌లో నోరు మెదపడం లేదన్నారు. దీంతో, బిజెపి, వైసిపిల మధ్య అనైతిక ఒప్పందం జరిగినట్టు అనుమానించాల్సి వస్తుందన్నారు. దీనిపై సిఎం జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. అటవీ హక్కుల చట్టం అమలు చేయడంలో తీవ్ర అలసత్వం ప్రదర్శించడంతోపాటు దేశవ్యాప్తంగా 23లక్షలు, రాష్ట్రంలో 64వేల అఫిడవిట్స్ తిరిస్కరణకు గురైనా గిరిజనుల తరపున సమర్థవంతమైన న్యాయవాదులను నియమించలేదన్నారు.

విలేకర్ల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే సున్నం రాజయ్య పాల్గొన్నారు.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

**ఇంజనీరింగు పనులు**

(1) టెండరు ప్రకటన నెం. eT-HQ-WAT-28-2019 తేదీ. 29.07.2019

**పని పేరు:** అసిస్టెంట్ డివిజన్ ఇంజనీరు/ఎస్టేట్-I మరియు ఎస్టేట్-II/వాల్తేరు వారి పరిధిలో (1) విశాఖపట్నం, మర్రిపాలెం & డీజిల్ లోకో షెడ్ వద్ద RPF బ్యారక్‌నకు మరమ్మతులు (2) వడ్లపూడి వద్ద RPF డిపార్టుమెంట్ కొరకు జోనల్ ట్రైనింగ్ సెంటర్‌గా వినియోగించుటకు బాలభారతి పబ్లిక్ స్కూలుకు మరమ్మతులు.

**పని విలువ సుమారు:** ₹ 75,12,351.50, బయానా: ₹ 1,50,300/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900/-, పని పూర్తి చేయు కాలం: 08 నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 27.08.2019న 1330 గంటలు

(2) టెండరు ప్రకటన నెం. eT-East-WAT-27-2019 తేదీ. 29.07.2019

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/విజయనగరం వారి పరిధిలో గరివిడి రైల్వే స్టేషన్ వద్ద ఫ్లాష్ బట్ వెల్డింగ్ ప్లాంట్ కొరకు సర్వీసు భవనం ఏర్పాటు & విజయనగరం స్టేషన్ వద్ద RPF బ్యారక్‌నకు మరమ్మతులు చేయుట.

**పని విలువ సుమారు:** ₹ 66,14,615.21, బయానా: ₹ 1,32,300/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 5,900/-, పని పూర్తి చేయు కాలం: 08 నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 29.08.2019న 1330 గంటలు

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్) వాల్తేరు

PR-269/K/19-20

# విజయభాను సంపాదకీయం

## టైగర్ జిందా హై

ఆర్థికశక్తిగా ఎదుగుతున్న భారత్ పెద్ద పులుల సంరక్షణలో కూడా ముందుండి ఐక్యరాజ్య సమితి ప్రశంసలను అందుకోవడం అభినందనీయం. దేశంలో పెద్దపులుల అంచనా నివేదికను ప్రధాని మోదీ ఇటీవల విడుదల చేస్తూ- ఒకప్పుడు ఏక్ టైగర్ థా అన్నట్టు ఉండేది. ఇప్పుడు టైగర్ జిందా హైఅన్నట్టుగా ఉన్నదని, ఇక్కడితో ఆగకూడదనీ, బాగోంమే బహార్ హై అన్నట్టుగా మారాలని చమత్కరించారు. మన దేశంలో 2006లో ఉన్న పులుల సంఖ్య 1,411 కాగా, ఇప్పుడు 2, 967కు పెరిగాయి. పులుల సంఖ్య పెంపులో 2022 వరకు సాధించవలసిన లక్ష్యాన్ని భారత్ ఇంకా ముందే సాధించింది. ప్రపంచంలోని 75 శాతం పెద్ద పులులు ఉండేది మన దేశంలోనే. అందువ ల్ల మన దేశంలో సంరక్షణ పట్ల ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొనడం సహజం. పులులను గుర్తించడానికి పాద ముద్రలను గుర్తించడం మొదలుకొని అనేక విధానాలున్నాయి. కానీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని వీలైనంత కచ్చితత్వాన్ని సాధించడం ఈ గణనలోని ప్రత్యేకత. పులు లు సంచరించే 3,81,400 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న అటవీ ప్రాంతంలో కొంత దుర్భేద్యమైన అడవులు కూడా ఉన్నాయి. ఈ విస్తృత ప్రాంతంలో 26,838 కెమెరాలను అమర్చి లెక్కించారు. 2,461 పులులను ఫొటోలు తీయగలిగారు. కొన్నేండ్లుగా భారత్ పులుల సంరక్షణకు విశేష కృషిచేస్తుండటం ఫలితాలనిచ్చింది. వేటగాళ్ళ ముఠాలను కట్టడి చేయడం చాలావరకు సాధ్యమైంది. పులులు పెరిగేందుకు అవసరమైన అటవీ పరిస్థితులను కల్పించడం వల్ల కూడా ఈ పెంపుదల సాధ్యమైంది. అంతరిస్తున్న జీవులను, అడవులను సంరక్షించుకోవాలె. ఐక్యరాజ్య సమితి సంక్షేమ సమాజం, నివాసయోగ్యమైన భూగోళం కోసం నిర్దేశిస్తున్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వ పరిపాలన ఉండటం గమనార్హం. ఈ లక్ష్యాలను విడిగా సాధించడం సాధ్యం కాదు. పారిశ్రామికాభివృద్ధి సాధించే క్రమం లో సహజ వనరులపై ఒత్తిడి పడటం సాధారణం. ఈ క్రమంలో రెండింటి మధ్య సమతుల్యతను ఎంతో బాధ్యతగా, జాగరూకతతో సాధించాలె. అన్ని లక్ష్యాలకు అనుగుణమైన ఉత్తమ పరిపాలనా వ్యూహంతోనే సాధ్యం. పూర్తి ఏకాంత పరిస్థితులుఉంటే తప్ప పులులు జతకట్టవు. 2006లో అభయారణ్యాల సంఖ్య 28 కాగా ఇప్పుడు యాభై వరకు పెంచడం ఫలితాలనిచ్చింది. ఈ భూగోళంపై ఎన్నో సమస్యలుండగా పెద్ద పులుల సంరక్షణకు ఇంత ప్రాధాన్యం ఇవ్వడం అవసరమా అనే ప్రశ్న కొందరికి తలెత్తవచ్చు. కానీ భూగోళంపైన ఆధిపత్యం సాధించిన మానవులకు రెండురకాల బాధ్యతలు ఉంటాయి. ఒకటి- తమ కార్యకలాపాల ద్వారా మిగతా జీవరాశులకు ముప్పు ఏర్పడకుండా కాపాడవలసిన నైతిక బాధ్యత. రెండవది- మానవుల మనుగడకు పులుల సంరక్షణ కూడా అవసరం. ప్రకృతి లో సమతుల్యత దెబ్బతినకూడదు. భూగోళంపైన చెట్లు, ఇతర జీవులు నశించిపోతే మానవాళి కూడా అంతరిస్తుంది. పులులు లేకుండాపోతే మిగతా జంతువుల సంఖ్య పెరిగి చెట్లు అంతరిస్తాయి. అడవులు లేకపోతే వానలు పడవు. స్వచ్ఛమైన నదీ ప్రవాహాలూ ఉండవు. క్రిమి కీటకాలు నశించిపోతే పరాగసంపర్కం జరుగక మన ఆహార పంటలు కూడా పండవు. అందువల్ల భూగోళంపైన పెద్ద పులులు మొదలుకొని చెట్లు చేమలు, క్రిమి కీటకాదులు ఉంటేనే మనిషికి మనుగడ. వాతావరణ మార్పును అరికట్టాలని విజ్ఞులు చెబుతున్నది అందమైన ఈ భూగోళా న్ని నివాసయోగ్యంగా కాపాడుకోవడానికే. అందుకే మన అభివృద్ధి విధానాలు ప్రకృతిని నాశనం చేసేవిగా ఉండకూడదు. మానవులు నిరాడంబరమైన జీవనసరళిని మార్చుకోవాలె. భవిష్యత్ తరాలకు నివాస యోగ్యమైన భూగోళాన్ని, భద్రమైన, నాగరికమైన సమాజాన్ని అందించాలె. దేశవ్యాప్తంగా పెద్దపులుల సంఖ్య పెరుగుదలలో తెలంగాణ పాత్ర కూడా ఉండటం గర్వదాయ కం. ఉమ్మడి రాష్ట్రంలో పులుల సంఖ్య తగ్గుతూపోయింది. తెలంగాణ అవతరించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణలో, అడవుల సంరక్షణలో, పెద్ద పులులకు అనువైన వాతావరణా న్ని కల్పించడంలో విశేషకృషి చేసింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు పులుల సంఖ్య 20 లోపు ఉంటే ఇప్పుడు వాటిసంఖ్య 26 ఉండవచ్చునని 30కి పెరుగవచ్చని వెల్లడైంది. రాష్ట్రంలో ఉన్న అమ్రాబాద్, కవ్వాల్- రెండు అభయారణ్యాల నిర్వహణకు ప్రశంసలు లభించాయి.

## నివాసయోగ్యమైన స్థలాలను గుర్తించండి

### ఆర్డీవో ఆర్.గోవిందరావు



నర్సీపట్నం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీకి సంబంధించి తహశీల్దార్లు సంబంధిత మండల, గ్రామాలకు ప్రత్యక్షంగా వెళ్లి భూములను పరిశీలిం చాలని నర్సీ పట్నం ఆర్డీవో ఆర్.గోవిందరావు ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఆర్డీవో కార్యాలయ సమావేశ మందిరంలో నర్సీపట్నం డివిజన్ 10 మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఉగాది నాటికి ఇళ్ల పట్టాల జారీ చేయనున్న నేపథ్యంలో ప్రభుత్వ భూములను గుర్తించాల్సి ఉంటుందన్నారు. విశాఖ జిల్లాకు సుమారు రెండు లక్షల ఇళ్ల పట్టాలను జారీ చేయాల్సి ఉంటుందన్నారు. కాబట్టి తహశీల్దార్లు ఒక నిర్దిష్టమైన ప్రణాళికలు తయారు చేసుకుని క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములను పరిశీలించాలన్నారు. 2020 మార్చి నాటికి సిద్ధం చేయాల్సి ఉందన్నారు. సంబంధిత మండలాలలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు పల్స్ సర్వే ప్రకారం అర్హులైన ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి, ఒక్కొక్కరికి 1.5 సెంట్ల స్థలాన్ని ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ముందుగా లబ్ధిదారులను గుర్తించి ఎంత స్థలం కావాలన్నది పరిశీలించాలన్నారు. సమయం తక్కువగా ఉన్నందున సర్వే వేగవంతం చేయాలన్నారు. గ్రామాల వారి ఎఫ్ఎంబి దగ్గర పెట్టుకుని ప్రభుత్వ భూమి గుర్తించే కార్యక్రమాన్ని ఖచ్చితంగా జరగాలన్నారు. ప్రభుత్వ భూమి తప్పిపోకుండా సర్వే నంబర్ల వారీగా చూడాలన్నారు. మొదట ఏ సమస్య లేని భూములను గుర్తించాలని, తరువాత వివిధ సంస్థలకు కేటాయించిన భూములు వినియోగంలో లేకపోతే వాటిని గూర్చి కూడా పరిశీలించాలన్నారు లబ్ధిదారులు నివాసయోగ్యంగా ఉండేవిధంగా స్థలాలను పరిశీలించాలన్నారు. తహశీల్దార్లు స్వయంగా వెళ్లి భూములను పరిశీలించి ఆయా మండలాలలో సరిపడా భూమి దొరకని పక్షంలో, అసైన్డ్ లేక ప్రైవేటు భూముల భూసేకరణ ఉంటుందని, వాటికి ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం అవినీతి లేకుండా, నిష్పక్షపాతంగా, ఎలాంటి విమర్శలకు తావు లేకుండా, పారదర్శకంగా భూసేకరణ చేపట్టాలన్నారు. అనంతరం విజయవాడ నుండి సిసి ఎల్ఏ కార్యాలయం నుండి స్పెషల్ చీఫ్ సెక్రటరీ మన్మోహన్ సింగ్, హౌసింగ్ స్పెషల్ కమీషనర్ హరినారాయనన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గన్నారు.

ఈ సందర్భంగా సిసిఎల్ఏ మాట్లాడుతూ రెవెన్యూ , పంచాయతీరాజ్, గ అహనిర్మాణ శాఖ అధికారులు, సిబ్బంది ఒక టీములా ఏర్పడి గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో పర్యటించి స్థలాలను గుర్తించాలన్నారు.

నిరుపేద లబ్ధిదారులు ఎంత మందికి ఇళ్ల స్థలాలు ఉండి ఇల్లు కావాలని, ఇల్లు స్థలాలు లేనివారు స్థలం కావాలి అని అడుగుతున్న వారి వివరాలను వేరువేరుగా సేకరించాలన్నారు. అదేవిధంగా స్పందనలో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలన్నారు.

ఎండోమెంట్స్ భూములకు సంబంధించి మాన్యాస్ భూముల వివరాలను నీవేదికను తయారు చేసి పంపాలన్నారు. ఈ సమావేశంలో నర్సీపట్నం డివిజన్‌లోని తహశీల్దార్లు, డిటిలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

రోలుగుంట : ప్రాథమిక సహకార సంఘాల పాలక వర్గాల కాలపరిమితి ముగియడంతో ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను నియమించింది. ఈ మేరకు రోలుగుంట, జానకిరాంపురం సహకార సంఘాలకు నూతన అద్యక్షుడు, సభ్యులు నియమితులయ్యారు. రోలుగుంట పిఎసిఎస్ అధ్యక్షుడిగా చెట్టుపల్లి వెంకట్రావు, డైరెక్టర్‌గా శెట్టి వెంకట రాజారావు, యర్రంశెట్టి అప్పలనాయుడు (బాబురావు), జానకిరాంపురం పిఎసిఎస్ అధ్యక్షుడిగా గొర్లె వెంకటరామన్, డైరెక్టర్లగా గొల్లు రాజుబాబు, దేవాడ రమణ నియమితులయ్యారు. ఈ కమిటీలు ఆరు నెలల పాటు విధులు నిర్వహించనున్నారు. ఈ కమిటీలు ఆరు నెలల పాటు విధులు నిర్వహించనున్నారు. తర్వాత వారి పదవీ కాలం పొడిగించినా లేదా ఎన్నికలు నిర్వహించాలా అన్నది రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ఉంటుంది.

## ప్రజావ్యతిరేక విధానాలు తగవు

యలమంచిలి రూరల్ : కేంద్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయడం, కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్చడం వంటి ప్రజావ్యతిరేక విధానాలను అవలంభించడం దారుణమని యలమంచిలి యూనిట్ బీమా ఉద్యోగుల సంఘం కార్యదర్శి బి.రామారావు ఆరోపించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలు ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసే విధంగా ఉన్నాయన్నారు. జీవిత బీమా సంస్థను స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ చేసేందుకు, బీమా రంగంలో ఎఫ్‌డిఐని వంద శాతం తేవాలని కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదించడం వంటి చర్యలు దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రమాద ఘంటికలుగా మారే అవకాశం ఉందన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

## నవోదయకు విద్యార్థిని ఎంపిక

నాతవరం : మండలంలో గన్నవరం మెట్ట గ్రేషియష్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కి చెందిన విద్యార్థి కోసూరు భావన నవోదయకు ఎంపికైనట్లు స్కూల్ కరస్పాండెంట్ వి.జెకర్యా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి భావనను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ వి.రాజేంద్రసింగ్, ఉపాధ్యా యుడు దినకర్ సిబ్బంది పాల్గొన్నారు.



## సమన్వయం (కవి సమయం)

### మనిషి ప్రవర్తన

మంచి మనస్సు ఆలోచనా ధోరణి
సమాజ శ్రేయస్సు, పరుల హితం
పరోపకారం, క్షమాగుణం
సహనం, సర్వజీవ సమానత్వం
సాత్వికప్రవర్తన, మితభాషణం
సజ్జన సాంగత్యం, ప్రేమతత్వం
సత్పురుషుల ఆలోచనా తత్వం
మనందరికీ స్ఫూర్తిదాయకం
కోరికలను నియంత్రించుకోవడం
అరిషడ్వర్గాలను లోబరుచుకోవడం
మానవసేవే ప్రధాన కర్తవ్యంగా
ముందుకు సాగడం అవశ్యం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : శ్రావణ; తిథి : తదియ రా.2.01; మఘ ఉ.10.35; సా.వ. 6.01 ల 7.30 వరకు | శనివారం 03-08-2019

**మేషం** : ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. ఆత్మీయుల కోసం ధనం విరివిగా వ్యయం చేయవలసి వస్తుంది. బంధువులను కలుసుకుంటారు. స్త్రీలకు షాపింగ్‌లోనూ, వాహనం నడుపు తున్నపుడు ఏకాగ్రత ముఖ్యం.నూతన పరిచయాలు, వాతావరణం సంతృప్తి నిస్తాయి.

**వృషభం** : బ్యాంకుల్లో మీ పనుల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కో వలసి వస్తుంది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయి. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు కలిసివస్తాయి. ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, ఒప్పందాల్లో మెలకువ వహించండి.

**మిథునం** :స్త్రీలకు, గృహ వాతావరణం, సంతానం వైఖరి వల్ల చికాకులు తప్పవు. కళాకారులకు, క్రీడాకారులకు మంచి గుర్తింపు రాణింపు లభిస్తుంది. పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం వల్ల పనులు అనుకూలిస్తాయి. ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణం మంచిది కాదు.

**కర్కాటకం** :విదేశీ వస్తువుల పట్ల ఆకర్షితులవుతారు. ప్రముఖులను కలుసు కుంటారు. బంధువుల రాకతో గృహంలో సందడి నెలకొంటుంది. మీ సంతానం ఉన్నతి కోసం కొత్తకొత్త పథకాలు రూపొందిస్తారు. స్త్రీలలో ఒత్తిడి, హడావుడి అధికమవుతాయి.మీ స్థోమ తకు మించిన వాగ్ధానాల వల్ల ఇబ్బందుల ఎదుర్కొం టారు.

**సింహం** :పోస్టల్, కొరియర్ రంగాల వారికి ఒత్తిడి, పనిభారం అధికమ వుతుంది. నిరుద్యోగులకు సదావకాశాలు లభించిన సద్వినియోగం చేసు కోలేరు. ఉపాధ్యాయులకు పై అధికారుల నుంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ కళత్ర మొండివైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

**కన్య** : కొంతమంది మీతో సన్నిహితంగా ఉంటూనే చాటుగా అపకారం తలపెట్టేందుకు యత్నిస్తారు. చిన్ననాటి మిత్రులను, ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. స్థిరాస్తిని కొనుగోలుచేయు యత్నాలు ఫలిస్తాయి. పనులు మొదట్లో మందగించినా క్రమేపీ పూర్తికాగలవు. కుటుంబీకులతో దైవ దర్శనాలు చేసుకోగలగుతారు.

**తుల** : కాంట్రాక్టర్లకు కార్మికులతో సఖ్యత నెలకొంటుంది. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. భాగస్వామి మాటతీరు, కదలికలను గమనించడం ఎంతైనా మంచిది. మొక్కుబడులు తీర్చుకోవాలనే మీ సంక ల్పం నెరవేరుతుంది.

**వృశ్చికం** : ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాల్లో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. వృత్తిపరంగా ఎదుర్కొంటున్న ఆటంకాలు క్రమంగా తొలగి పోగలవు. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్ట మవు తుంది. సభలు, సమావేశాలల్లో హుందాగా వ్యవహరించి అందరినీ ఆకట్టుకుంటారు.

**ధనుస్సు** : ఫ్యాన్సీ, స్టేషనరీ, రసాయన, సుగంధ ద్రవ్య వ్యాపారులకు శు భదాయకం. ఒంటెత్తు పోకడ మంచిది కాదని గమనించండి. ఆకస్మిక ఫీజులు, బిల్లులు చెల్లిస్తారు. పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. సోదరీ, సోదరులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబీకుల ఆరోగ్యంలో మెళకువ అవసరం.

**మకరం** : ఆర్థిక కార్యకలాపాలు సానుకూలంగా సాగుతాయి. మీ సంతానం మొండివైఖరి వల్ల చికాకులు వంటివి ఎదుర్కొంటారు. ఫైనాన్స్ వ్యాపారస్తులకు ఖాతాదారుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. నిరుద్యోగులకు తాత్కాలిక అవకాశం లభిస్తుంది. పెద్దలతో కుటుంబ విషయాలు చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటారు.

**కుంభం** :కొత్త పనులు చేపట్టకుండా ప్రస్తుతం చేస్తున్న వాటిపైనే శ్రద్ధ వహించండి. నిరుద్యోగులకు రాత, మౌఖిక పరీక్షల్లో ఏకాగ్రత ముఖ్యం. కుటుంబ విషయాల్లో స్త్రీలకు పట్టుదల, పంతాలు మంచిది కాదు. ఉద్యోగ స్తులకు హోదాతో పాటు బరువు బాధ్యతలు పెరుగుతాయి. ఉపాధ్యాయులకు పనిభారం అధిక మవుతుంది.

**మీనం** : గృహంలో మార్పులు, చేర్పులు అనుకూలమైన కాలం. బ్యాంకు డిపాజిట్లు, దీర్ఘ కాలిక పెట్టుబడులకు అనుకూలం. పుణ్యక్షేత్రాల దర్శనం వల్ల మానసిక ప్రశాంతత చేకూరుతుంది. ఒక్కోసారి మీ జీవిత భాగస్వామి మనస్తత్వం అర్థం చేసుకోవడం కష్టమవుతుంది.

## జిల్లా ఎడిషనల్ ఎస్పీగా అజిత వేజెండ్ల బాధ్యతల స్వీకరణ

### జిల్లా అడిషనల్ ఎస్పీగా అచ్యుతరావు



అజిత వేజెండ్ల

విశాఖపట్నంః విశాఖపట్నం జిల్లా అడిషనల్ ఎస్.పి., పరిపాలనగా నియమితులైన అజిత వేజెండ్ల ఐ.పి.ఎస్., (2015 ఐ.పి.ఎస్ బ్యాచ్ చెందినవారు), శుక్రవారం విశాఖపట్నం జిల్లా పోలీసు కార్యాలయములో భాధ్యతలు స్వీకరించారు. అలాగే విశాఖపట్నం జిల్లా అడిషనల్ ఎస్.పి., క్రైమ్స్ నియమితులైన బి.అచ్యుతరావు, జిల్లా పోలీసు కార్యాలయములో భాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్.పి., బాబూజీ అట్టాడ ఐ.పి.ఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. అజిత వేజెండ్ల ఐ.పి.ఎస్., విశాఖపట్నం జిల్లా అడిషినల్ ఎస్.పి., పరిపాలనగా విశాఖపట్నం జిల్లాకు ప్రమోషన్‌పై వచ్చారు. ఈమె గతంలో గ్రేహూండ్స్, రంపచోడవరం, రాజమహేంద్రవరంలో పనిచేశారు. శు క్రవారం ఆమె జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి తనను పరిచయం చేసుకుని మిగతా సిబ్బందితో మాట్లాడారు. బి.అచ్యుతరావు, విశాఖపట్నం జిల్లా అడిషనల్ ఎస్.పి., క్రైమ్స్ గతంలో విశాఖపట్నం సిటీ, ఆర్.ఐ.వో., విశాఖపట్నం - ఏలూరు తదితర ప్రాంతాలలో పనిచేసి, అమరావతి డి.జి.పి., కార్యాలయము నుంచి విశాఖపట్నం జిల్లాకు వచ్చారు.



## దర్యాప్తు చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలి

రావికమతంః కలెక్టర్ స్పందనలో ఫిర్యాదుపై దర్యాప్తు చేయకుండా తప్పుడు రిపోర్టు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో రావికమతం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు సిహెచ్.సూరిబాబు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు మాట్లాడుతూ గత నెల 15వ తేదీన బాదంపాడు రెవెన్యూ పరిధిలో 56-1, 56-2, 56-3లో చోడవరంకు చెందిన పశుమూర్తి కామేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేవామని, కలెక్టర్ 90 రోజుల్లో ఈ భూసమస్యను పరిష్కారం చేయాలని సమయం ఇస్తే 10 రోజుల్లోగానే పరిశీలన చేస్తామని అధికార్లు పంపడాన్ని వ్యతిరేకించడంపై ధర్నా నిర్వహించామన్నారు. 2017లో సిట్‌లో 1026 నెంబరులో అప్పటి తహశీల్దార్, ఆర్ఐ సీలింగ్ భూముల పరిశీలన చేసి పిఒటి చట్టం ప్రకారం కామేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు. కానీ అప్పటి నుండి రెవెన్యూ అధికార్లు భూమి సమస్య పరిష్కారం చేయలేదన్నారు. కానీ సీలింగ్ భూమిలో 30 టేకు చెట్లు దొంగ చాటున నరికి వేశారన్నారు. కానీ నేటి వరకు భూసమస్యల పరిష్కారం చేయకపోవడం అన్యాయమన్నారు. కావున వెంటనే కలెక్టర్ ఆదేశాలను పరిగణలోనికి తీసుకొని విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, కెవిపిఎస్ మండల కార్యదర్శి వై.కళ్యాణం, గిరిజన సంఘం నాయకులు వై.యరకన్నదొర తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# విద్యార్థినులపై లైంగిక వేధింపులు

అనంతగిరి : సమాజానికి ఆదర్శంగా నిలవాల్సిన గురువులు చెడు మార్గం లో ప్రయాణం చేస్తున్నారు, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే విద్యార్థినులుపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని తమతో విహార యాత్రకు రావాలని కావాల్సినవి కొని పెడతామని గిరి విద్యార్థినులుపై ఒత్తిడి చేసి భయాందోళనలకు గురి చేసిన సంఘటన అనంతగిరి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాల లో చోటు చేసుకుంది తల్లి తండ్రుల ఫిర్యాదు మేరకు సదరు ఉపాధ్యాయులను సీపీఎం నాయకులు నిలదీశారు

మండల కేంద్రము గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ బాలికల పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు నరాజి ప్రసాదరావు ప్రధానోపాధ్యాయుడు ఎల్‌బి.దయానిధి పీడి తదితరులు పదోతరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థినిలును తరగతులు అయిపోయిన తర్వాత పిలిచి విశాఖపట్నం ఆర్ కె బీచ్ కైలాస్ గిరి ఉడాపార్కు తో పాటు విజయనగరం ఎస్ కోట తదితర ప్రాంతాలను తమ కార్ల లో తీసుకు వెళ్తామని కావాల్సిన డబ్బులు ఇష్టమైన దుస్తులు కొని పెడతామని చెప్పి తమక అనుకూలంగా చేసుకునే ప్రయత్నం చేశారు. ఉపాధ్యాయులు చెప్పిన మాటలకు పిల్లలు ఒప్పు కోలేదు విద్యార్థినులు పాఠశాల విడిచి ఇంటికి వెళ్ళి జరిగిన విషయాలు తమ కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థినులు తల్లి తండ్రులు మండల సీపీఎం నాయకులు దీసరి గంగరాజు వేంగడ మాజీ సర్పంచ్ ఎస్ కొండలరావు మరియు సీపీఎం మండల కార్యదర్శి కిల్లో మొసియా తెలిపారు. వెంటనే విద్యార్థినులు వారి తల్లిదండ్రులను తీసుకొని పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను నిలదీయగా ఆయన నుంచి సమాధానం లేదని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశామని విజయభాను ప్రతినిధికి తెలిపారు.

# కార్మిక చట్ట సవరణకు వ్యతిరేకంగా ర్యాలీ

**చోడవరం తహసీల్దారు కార్యాలయంవద్ద నిరసన తెలుపుతున్న ఏ.ఐ.ఎఫ్.టి.యు నాయకులు**

చోడవరం : కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన కార్మిక చట్ట సవరణ వ్యతిరేకిస్తూ ఏ.ఐ.ఎఫ్.టి.యు ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. శివాలయం వీధి నుంచి స్థానిక తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందచేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను కుదింపుచేసే పనులు మానుకోవాలని, అలాగే గత నెల 23న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన వేతనాలు, పని సంబంధమైన ఆరోగ్యం, భద్రత బిల్లులను ఉప సంహరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం, 8గంటల పనిదినాలు, అమలు చేయాలని, కార్మికులు, ఉద్యోగుల తొలగింపు ఆపాలని,అలాగే ఇసుక లేమి వలన భవణ నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఇసుకను రీచ్‌ల ద్వారా అమ్మకాలు సాగించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం, లక్కవరం భవణ నిర్మాణ కార్మికులు ఏఐఎఫ్.టి.యు. న్యూ నాయకులు అప్పలనాయుడు, ఓవివిఎస్. లక్ష్మీకుమారి, గొంప దేవి, అప్పారావు, అప్పలరాజు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఘనంగా ప్రారంభమయిన శ్రావణ లక్ష్మిపూజలు



పూర్ణామార్కెట్ : ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణ మాసం సందర్భంగా జరుగు శ్రావణలక్ష్మి పూజలు శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. గత 14 సంవత్సరములుగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ శ్రీ లక్ష్మి పూజలను మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలనచేసి లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక శాసన సభ్యుడు వాసుపల్లి గణేశ్ కుమార్ దంపతులు పూజలో పాల్గొన్నారు . ఈ సందర్భంగా గణపతి పూజ నిర్వహించి తదుపరి అమ్మవారికి విశేష పూజ నిర్వహించారు. వేదమంత్రముల మధ్య నాదస్వర సుస్వరాలు మధ్య శ్రావణలక్ష్మి పూజలు ప్రారంబించారు. ఈ పూజలో 296 మంది ఉభయదాతలు రెండు బృందాలుగా స్వయంగా పాల్గొన్నారు. పోస్టల్ పూజలు 22 మంది భక్తుల పేరున పూజ నిర్వహించి వారికి ప్రసాదములు పంపించారు. స్వయంగా పూజలో పాల్గొన్న రెండు బృందాల భక్తులకు మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు డ్రా ద్వారా ఒక్కరికి ఆలయ ఉపకమీషనర్ కార్యనిర్వాహణాధికారి చేతుల మీదుగా శ్రీ అమ్మవారి వెండి (2) ప్రతిమలు బహుకరించుట జరిగినది. శ్రావణ మాసం నెల రోజులు (అనగా 02-08-2019 నుండి తేది. 30-08-2019) జరిగే ఈ శ్రావణలక్ష్మి పూజకు అవసరమగు పూజా సామగ్రి అంతయు దేవస్థానం వారే సమకూర్చేదరని తెలిపారు. ఈ ప్రత్యేక పూజా రుసుము రూ. 400/-లు. పూజ అనంతరం ఉభయదాతలకు శేషవస్త్రంగా కండువా, జాకెట్టు ముక్క రాగి స్టాండు యంత్రం మరియు ప్రసాదంగా 4 ప్యాకెట్లు పులిహోర, 14 ప్యాకెట్ల చక్కెరపొంగలి ఇవ్వబడును. కావున భక్తులు పవిత్ర శ్రావణమాసంలో శ్రీ అమ్మవారిని పూజించి, దర్శించి తరించవలసినదిగా కోరడమైనది. ఈ శ్రావణలక్ష్మి ప్రత్యేక పూజలు లక్ష్మీ/శుక్రవారం మినహా ప్రతి రోజు ఉదయం మరియు లక్ష్మీ/ శుక్రవారము రెండు బృందాలుగా నిర్వహించబడును.

# వ్యాధి నిరోధక శక్తి పెంచేది తల్లిపాలే

## ప్రాజెక్టు పరిధిలో ర్యాలీలు, అవగాహనలు

నర్సీపట్నం/రోలుగుంట/గొలుగొండ: బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని ఇచ్చేది తల్లి యొక్క ముర్రుపాలేనని నర్సీపట్నం సిడిపిఒ జివి.రమణి అన్నారు. శుక్రవారం నర్సీపట్నం ప్రాజెక్టు పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యార్థినిలకు, తల్లులకు, గర్భిణీలకు అవగాహన కల్పించారు. ర్యాలీలు చేపట్టారు.

చీడిగుమ్మలలో కార్యకర్తలు సత్య, ఘాటీలు ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో ఘనంగా కార్యక్రమం నిర్వ హించారు. రోలుగుంట



చీడిగుమ్మలలో ర్యాలీ నిర్వహిస్తున్న సిడిపిఒ జివి.రమణి



కొమరవోలులో ర్యాలీ చేస్తున్న సూరప్‌వైజర్ సత్య, అంగన్వాడీలు

మండలం బుచ్చెం పేటలో మంగ, యర్రయ్యమ్మకుమారి, కొమర వోలులో కృష్ణవేణి, జయ, అనంతలు, సూపర్‌వైజర్ సత్యవతి, ఏఎన్‌ఎంలతో తల్లులతో కలిసి ర్యాలీ చేశారు. నర్సీపట్నం మండలం వేములపూడి, శారదానగర్‌లో సూపర్‌వైజర్లు విజయకుమారి, కె.రామలక్ష్మి, ఆరోగ్య సిబ్బందితో కలిసి తల్లులకు అవ గాహన కల్పించారు. సూపర్‌వైజర్ బాస్కర కుమారి, పలువురు ప్రధానోపాధ్యాయులు, విద్యార్థినీలు, ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

## పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప



పెద్దాపురం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. గురువారం మండలంలోని కాండ్రకోట గ్రామంలో గత నాలుగు రోజులనుండి విషజ్వరాల వ్యాధికి ప్రజలుగురవుతున్న శాసనసభ్యులు కాండ్రకోట ప్రాధమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, రోగులను కలిసి వైద్య సేవలపై ఆరా తీశారు.అనంతరం ఆరోగ్య కేంద్రంలో అధికారులతో సమావేశమై మాట్లాడుతూ డెంగ్యూ, వైరల్ జ్వరాలపై,వాటి నిర్మూలనకు అనుసరించవలసిన పద్ధతులపై ప్రజలలో అవగాహన కల్పిం చాలని తెలిపారు.గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని ఈవోపీఆర్డీ, పంచాయతీ సెక్రటరీలను ఎమ్మెల్యే ఆదేశిం చారు. ఈ సమావేశంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ అనంతకుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు నమోదైన 27 కేసులలో వరలక్ష్మి, వినయ్‌లకు డెంగ్యూ పాజిటివ్ వచ్చిందని,7 కేసులు అను మానంగా ఉన్నాయని తెలిపారు.రెండు పాజిటివ్ కేసులు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని చెప్పారు.నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని,పారిశుద్ధ్యం మెరుగు పరుచుకోవాలని,జ్వరాలు వస్తే సొంత వైద్యం చేసుకోకుండా, ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య సేవలు పొందాలనీ, డెంగ్యూ జ్వరాలు నిల్వ ఉన్న మంచి నీరులో వుంటాయని తెలిపారు.గ్రామంలో కిరోసిన్ ను స్ప్రేయింగ్ చేయించడం జరిగిందని,హెల్త్ క్యాంపులు కూడా పెట్టడం జరిగిందని తెలిపారు. డెంగ్యూ సంబంధించిన వ్యాధికి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో వార్డులు కేటాయించడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ పృథ్వీ, ఎంపీహెచ్ ఎస్ రామ్మోహన్ రావు,సబ్ యూనిట్ ఆఫీసర్ జీవన్ కుమార్, ఎంపీహెచ్ఇఓ ప్రసాద్,ఈవోపీఆర్డీ హిమ మహేశ్వరి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గదేవి ఆలయంలో భక్తి, శ్రద్ధలతో లక్ష కుంకుమార్చన



**పూలు, కరెన్సీ నోట్లతో అలంకరణలో చోడవరం కనకదుర్గాదేవి అమ్మవారు**

చోడవరం : పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలోని కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం సంద ర్భంగా లక్ష కుంకుమార్చన కార్య క్రమాన్ని భక్తి, శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పి.శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో అమ్మ వారికి వివిధ రకాల పూలు, వంద నోట్ల కరెన్సీతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుల బృందంచే సామూహిక కుంకుమపూజ నిర్వహిం చారు. దుర్గాదేవి ఆలయ కమిటీ, చోడవరం మోటారు వర్కర్సు యూని యన్ సభ్యులు, వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 200 మందికి పైగా మహిళలు పాల్గొని సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. అలాగే స్థానిక స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆల యంలోను పార్వతిదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. స్వయంభూ గౌరీశ్వరస్వామి సన్నిధిలో గల సంతోషి మాత అమ్మవారి ఆలయంలోను ఆలయ ప్రధాన అర్చకులు కొడమంచిలి గణేష్ ఆధ్వర్యంలోను, వెలమవీధి లక్ష్మమ్మతల్లి ఆలయంలోను శ్రావణ మాసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అలాగే స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలోను అమ్మ వారికి కుంకుమ పూజలు జరిపారు. దేవా లయ ఛైర్మన్ కలగర్ల శేషు,అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గాలమ్మ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు

సబ్బవరం : మండల కేంద్రంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ గ్రామ ప్రజల ఇలవేల్పు అయిన శ్రీ దుర్గా లమ్మ ఆలయం ఆవరణలో శ్రావణ మాసం ప్రధమ శుక్రవారం పురస్కరించుకొని ఆలయ ప్రధానార్చకులు రేజేటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు అత్యధికంగా మహిళలు ఈ కుంకుమ పూజలు పాల్గొని పూజలు చేశారు అనంతరం దుర్గా లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు శ్రావణమాసం 5 శుక్రవారాలు సాయంత్రం ఐదు గంటల నుండి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించబడును అని ఆలయ అర్చకులు చంద్రశేఖర్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో వాలంటీర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం




విశాఖపట్నం : స్థానిక సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ 1 యూనిట్, యూనిట్ 2 వాలంటీర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. షైజీ పి.డి. కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. కళాశాల పూర్వ ప్రోగ్రాం ఆఫీసర్ డా.టి.శేషులత ఎన్ఎస్ఎస్ యొక్క లక్ష్యాలను, కార్యక్రమాలను, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం స్వచ్ఛ ఫక్వాడా ప్రతిజ్ఞను వాలంటీర్లతో కళాశాల ఆవరణలో చేయించి, తదనంతరం కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేసే కార్యక్రమంలో ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన పనులను ప్రారంభించారని ప్రోగ్రాం ఆఫీసర్లు రాజేష్ మరియు దీప్తి తెలియజేశారు.

# విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అధీప్ రాజ్



పరవాడ : విశాఖపట్నం విమానాశ్రయం లో రాజ్యసభ సభ్యులు మరియు ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార ప్రతినిధి వి.విజయసాయిరెడ్డిని పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ గారు,భగవాన్ జయరామ్ గారు,అజయ్ రాజ్ గారు,పైల శ్రీనివాసరావు, చుక్క రామునాయుడు, సిరిపురపు అప్పలనాయుడు, నారాయణమూర్తి,నాగేశ్వరరావు, దాసరి రాజు, ఎల్.బి.నాయుడు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.

# ముగ్గురు ఉపాధ్యాయులకు ప్రమోషన్

అనంతగిరి : స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో పనిచేస్తున్న +జూంఘ.పాఠశాల లో పనిచేస్తున్న ముగ్గురు ఉపాధ్యాయులు కు స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ రావడంతో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అధ్యక్షతన సన్మానం చేయుట జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.మల్లీశ్వరి అండ్ కె.భాస్కరరావు సి.ర్.పి.కె.రామకృష్ణ,, యూటీఫ్.జిల్లా సహా అధ్యక్షులు ఎస్.రాంబాబు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కిశోర బాలికలకు పౌష్టికాహారంపై మరింత శ్రద్ధ తీసుకోవాలి



**జుత్తాడలో పౌష్టికాహార ఆవశ్యకతపై కిశోర బాలికలకు వివరిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు**

చోడవరం : మారుతున్న వయస్సుకు అనుగుణంగా కిశోర బాలికలు పౌష్టికాహారంపై మరింత శ్రద్ధ తీసుకోవాలని అంగన్వాడీ కార్యకర్తలు వివరించారు. మండలంలోని జుత్తాడ గ్రామం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో ఐ.సి.డి.ఎస్ తల్లి పాల వారోత్సవాలలో భాగంగా కిశోర బాలలకు శరీరంలో కలిగే మార్పులు, పోషక విలువలు కలిగిన కోడి గ్రుడ్డు, చిరుధాన్యాలతో తయారు చేసిన పదార్థాలు, ఆకు కూరలు, పీచుపదార్దాలు తదితరవాటిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓ. సీతబాబు, పాఠశాల పిఈటీ, జుత్తాడ, గజపతినగరం అంన్వాఢీ కార్యకర్తలు సి.హెచ్.ధనలక్ష్మి, పొట్ల సూర్యకాంతం, కె.శ్రీదేవి, మళ్ళ ప్రసన్న, పాఠశాల విద్యార్ధినిలు తదితరులు పాల్గొన్నారు.

# మీ స్థితి తెలుసుకోండిపై అవగాహన సదస్సు



యానాం : పుదుచ్చేరి ఆరోగ్యశాఖ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు వారి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య సిబ్బంది కి ఆస్పత్రి సమావేశం హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి డిప్యూటీ డైరెక్టర్ కే సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవగాహన సదస్సు ఆగస్టు 1 నుండి 31 వరకు ఆయా ఆరోగ్య కేంద్రాలలో గల ప్రజలకు ఎయిడ్స్ కంట్రోల్ సిబ్బంది సే నిర్వహిస్తున్నట్లు తెలిపారు .ఈ అవగాహనలో ఎయిడ్స్ నియంత్రణ ,క్షయ వ్యాధి నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మీ సి తెలుసుకోండి అనే అంశంపై ప్రతి ఒక్కరు రక్త పరీక్షలు చేయించుకొని ఎయిడ్స్, క్షయ వ్యాధి తదితర వ్యాధుల నిర్ధారణ గూర్చి తెలుసుకోవాలన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు ఈ పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలన్నారు. ఈ అవగాహన సదస్సును,ఈ రక్త పరీక్షలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎయిడ్స్ కంట్రోల్ సిబ్బంది ఈ వ్యాధులపై అనేక విషయాలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్పి రచనా సింగ్, పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సిబ్బంది యానం ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది ఏఎన్ఎంలు ఆశ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 8న జాతీయ బాలల హక్కుల కమిషన్ సదస్సు

విజయనగరం: జాతీయ బాలల హక్కుల కమిషన్ ఈనెల 8వ తేదీన జిల్లా కలక్టర్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.కె.విజయలక్ష్మి తెలిపారు. బాలల హక్కుల అవరోధాలు, ఉల్లంఘనలు జరిగిన వాటి ఎఫిర్యాదులను స్వీకరిస్తరని తెలిపారు. అలాగే వైద్యం పట్ల అశ్రద్ధ, రకతమార్పిడి, హెచ్.ఐ.వి. సంబంధించిన చికిత్సకు స్పందించకపోవడం, వ్యాధికి పోషకాహారం ఇవ్వకపోవడం, అంగన్వాడీల మధ్యాహ్న బోజన సథకంలో సమస్యలు మాదకద్రవ్యాల మరియు అవసరమైన చికిత్స, భ్రూణహత్యలు, వైద్య చేయకపోవడం..అశ్రద్ధ తదితర అంశాలపై ఫిర్యాదు వ్రాతపూర్వకంగా ఇవ్వాలని తెలిపారు.

## విద్యార్థులు ప్రతిభకనబర్చినప్పుడే మంచి ఉద్యోగావాకాశాలను అందిపుచ్చుకోగలరు

### జిల్లా కలెక్టరు డి.మురళీధర్ రెడ్డి

కాకినాడ : విద్యార్థులు విద్యాభ్యాసం పూర్తి చేసుకొని ప్రతిభకనబర్చినప్పుడే మంచి ఉద్యోగావాకాశాలను అందిపుచ్చుకోగరని జిల్లా కలక్టరు డి.మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ కలక్టరేట్ లో ఇండిగో ఎయిర్ లైన్స్ లో వికాస ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశాలు కల్పిస్తూ నియామక ఉత్తర్వులు జిల్లా కలక్టరు డి.మురళీధర్ రెడ్డి, జేసి-2 జి.రాజకుమారి, డిఆర్ఓ సిహెచ్.సత్తిబాబు అభ్యర్థులకు అందజేసారు. ఈ సందర్భంగా కలక్టరు మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ ఆయా రంగాల్లో ఉపాధి కొరకు శిక్షణ పొంది ప్రతిభ ఉన్న వారికే ఉద్యోగాలు కల్పిస్తున్నారని తెలిపారు. వికాస సంస్థ జిల్లా కే పరిమితం కాకుండా అన్ని జిల్లాల వారికి శిక్షణ ఇచ్చి నియామకాలు కల్పిస్తున్నారని చెప్పారు. అదే విధంగా పరిశ్రమల స్థాపించిన ప్రదేశాల్లో స్థానిక ప్రజలు నేరుగా లబ్ధిపొందేలా 75 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని, పారిశ్రామికవేత్తలు ప్రతిభ ఉన్న వారిచే ఉద్యోగవకాశాలు కల్పించడం జరుగుతుందని చెబుతున్నారన్నారు. యువత చదువుతో పాటు సరైన శిక్షణ పొందాలని ఇందుకు వికాస సంస్థ శిక్షణ ఇచ్చి పోస్టింగ్ కల్పిస్తోందని కలక్టరు మురళీధర్ రెడ్డి తెలిపారు. ఇంజనీర్లు, డాక్టర్లు, న్యాయవాదులు ఏ విద్యా సంస్థలో విద్యనభ్యసించారో దానిని బట్టి వారికి గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే వికాస నాణ్యతతో కూడిన శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాది అవకాశాలు కల్పిస్తుందన్నారు. వికాస ద్వారా ఉద్యోగాలు పొందిన వారు లక్ష్యాలు సాధించి ఉన్నత స్థానాలను వెళ్ళిన వారు వికాస సంస్థ అభివృద్ధి చెందడానికి సమాచారం మరియు సహకారమందించాలని కలక్టరు కోరారు. వేరే ప్రాంతాల్లో విధుల్లో చేరినప్పుడు సాధకబాధకాలు ఉప్పటికీ కష్టపడి పని చేసి ఉన్నతల స్థానాలు చేపట్టాలని కలక్టరు మురళీధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జాయింట్ కలక్టర్-2 జి.రాజకుమారి మాట్లాడుతూబ నిరుద్యోగ యువత ఏ చిన్న అవకాశమొచ్చినా అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. ఉపాధి అవకాశాల ద్వారా సమాజంలో గౌరవమైన స్థానంలో ఉండాలని లక్ష్యముంటే ఏదైనా సాధించవచ్చని ఆమె తెలిపారు. ఉద్యోగం చేసే ప్రాంతంలో అక్కడి వాతావరణానికి అలవాటు పడాలని అప్పుడే ఉన్నతమైన జీవన ప్రమాణాలు ఉంటాయని జేసి-2 రాజకుమారి తెలిపారు. వికాస సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ మరియు ఇన్ చార్జీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.లచ్చారావు మాట్లాడుతూ ఇండిగో ఎయిర్ లైన్స్ హైదరాబాదులో 151 మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించి నియామక పత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. అదే విధంగా 44 మంది యువకులకు డ్రోన్ పైలెట్ శిక్షణ, 18 మంది యువతులకు టాలీ ఎక్కౌంటెన్సీలో శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్స్ ఇవ్వడం జరిగిందన్నారు. వికాస 2010లో ఏర్పాటు చేస్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగవకాశాలు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం పోస్టింగ్స్, గ్రీవెన్స్ లో పిటిషన్స్ ముందు వచ్చిన వాటికి ప్రాధాన్యత, నైపుణ్యాలు ఉన్న వారికి ఇంటర్వ్యూ, శిక్షణ ఇచ్చి పోస్టింగ్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉద్యోగాలు కల్పించిన వారికి జీతాలు ఆన్ లైన్ ద్వారా వారి ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. 2012 నుండి 2019 వరకు 70 వేల మందిని వికాస సంస్థ ద్వారా వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడం జరిగిందన్నారు. వికాస సంస్థకు భారత ప్రభుత్వం చే గోల్డెన్ స్కాచ్ అవార్డు పొందడం జరిగిందనిపిడి లచ్చారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికాస ప్లేస్ మెంట్ మేనేజర్ పి.శ్రీకాంత్, ఎన్.సుబ్రహ్మణ్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏఎన్ఎంలను గ్రామ సచివాలయాల్లో నియమించాలి

### రాష్ట్ర ఎఎన్ఎం సంఘం డిమాండ్



విజయనగరం: వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఆర్.సి.హెచ్. 2వేల104 ఎస్.ఎన్ .సియూ విభాగాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలను గ్రామ సచివాలయాల్లో ఎన్ఎంలుగా నియమించాలని ఏపి ప్రభుత్వ కాంట్రాక్ట్ సెకండ్ ఏఎన్ఎంల సంఘం ప్రతినిధులు డి.వి.ఎన్.రత్నకుమారి, జీ.ప్రీణ,పార్వతి కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఎల్ఏ కోలగట్ల వీరబధ్ర స్వామికి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో గత 20 ఏళ్ళుగా వీరు పనిచేస్తున్నారని అవుట్ సోర్స్‌లో పనిచేస్తున్న వీరిని రెగ్యులైజ్ చేయాలని కోరారు. వారి సర్వీస్, అర్హత అనుభవం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా వారికి అవకాశం కల్పిస్తామని ప్రజా సంకల్ప యాత్రలో జగన్ మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు స్పందించిన ఎమ్మెల్యే స్వామి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.

## పింగళి వెంకయ్య 143వ జయంతి సందర్భంగా భారీ జాతీయ పతాకంతో దేశభక్తి కార్యక్రమం



విశాఖపట్నం : జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య 143 వ జయంతి సందర్భంగా.. విశాఖ, వన్టౌన్ ప్రాంతంలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద సేవా సంస్థ భారీ జాతీయ పతాకంతో దేశభక్తి కార్యక్రమం చేపట్టింది. సంస్థ నుంచి రాణి బొమ్మ కూడలి వరకు జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ జహీర్ అహ్మద్ మాట్లాడుతూ పింగళి వెంకయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఆయన శిలా విగ్రహాన్ని పార్లమెంటులో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయన జయంతిని చేశారు. ఆయన జయంతిని అధికారంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో.. ఒక జిల్లాకు పింగళి పేరు పెట్టాలని కోరారు. ఈ ర్యాలీ లో ప్రముఖ సంఘ సేవకులు, సంస్థ గౌరవ అధ్యక్షులు డాక్టర్ జహీర్ అహ్మద్, మక్సూద్ అహ్మద్, చింతపల్లి పోతరాజు, బండారు గజపతి స్వామి, డిఎస్ అగర్వాల్, పేపర్ Surada అప్పారావు, గంధ కోదండ, ఎం నాగేశ్వరరావు, vasupalli ఉమాదేవి, పోలవరపు అప్పలకొండ, దూడ రాజు. సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు.

## భారతీయ రంగస్థల పితామహుడు బళ్లారి

### నంది అవార్డు గ్రహీత జొన్నలగడ్డ

విజయనగరం : భారతీయ రంగస్థల పితామహుడు బళ్లారి రాఘవ అని నంది అవార్డు గ్రహీత జొన్నలగడ్డ సీతారామశాస్త్రి అన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని కొత్తఅగ్రహారంలోని గీతాంజలి పాఠశాలలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బళ్లారి రాఘవ ఈ తరం రంగస్థల నటులకు స్ఫూర్తిప్రదాత అని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. బళ్ళారి రాఘవ 12ఏళ్ల ప్రాయంలోనే రంగస్థలం ప్రవేశం గావించారని విదూషకుని పాత్రనుండి మహారాజు పాత్రవరకు అన్ని పాత్రలను సమర్ధవంతంగా రాఘవ పోషించాడని, తెలుగు, ఇంగ్లీషు, హిందీ, కన్నడ భాషల్లో నాటకాలు వేసి దేశానికి ఎనలేని కీర్తిప్రతిష్టలు ఆర్జింపచేసారని అన్నారు.

అనంతరం గురజాడ అప్పారావు రాసిన కన్యాశుల్కం పాత్రలోని గిరీశం పాత్రకు సంబంధించిన డైలాగులును ప్రముఖ రంగస్థల నటుడు రాష్ట్రస్థాయిలో అనేక పురస్కారాలు పొందిన తెలికిచర్ల అనిల్‌కుమార్ చక్కగా వినిపించారు.తదుపరి అనిల్ కుమార్‌ను సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్, జొన్నలగడ్డ సీతారామశాస్త్రి ఘనంగా సత్కరించారు.



ఈ కార్యక్రమంలో సమితి సలహాదారు ఎం సుభద్రాదేవి, పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్‌కు జిల్లా ఎస్పీ అభినందన



విజయనగరం: ట్రాఫిక్ కానిస్టేబులుగా పనిచేస్తున్న తాళ్ళపూడి అప్పల నాయుడును జిల్లా ఎస్పీ బి. రాజకుమారి శుక్రువారం జిల్లా పోలీసు కార్యా లయంలో ప్రత్యేకంగా అభినందించారు. పట్టణంలో ధర్మపురి రోడ్డు వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న తాళ్లపూడి అప్పలనాయుడు రహదారిపై ఏర్పడిన గోతులు, వాటిలో నిలిచిన వర్షం నీరు కారణంగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించారు. ఈ సమస్యనుపరిష్కరించాలనే లక్ష్యంతో స్థానికంగా ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్న స్థలం వద్దకు వెళ్ళి, అక్కడ నిష్ప్రయోజనంగా పడి ఉన్న పాత ఇంటి మట్టి, పాత ఇటుకలను ఒక ట్రాక్టరు డ్రైవరు సహాయంతో తీసుకొని వచ్చి, రోడ్డు మీద ఏర్పడిన గుంతల్లో వేయించారు. రోడ్డు మీద వేసిన మట్టిని స్వయంగా పారతో సరి చేసి, వాహన దారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసారు. దీనిని గమనించిన స్థానికులు కానిస్టేబులు చేస్తున్న పనిని మొబైలు ఫోనుల్లో రికార్డు చేసి, సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఈ విషయాన్ని పత్రికలు, మీడియా ద్వారా తెలుసుకున్నజిల్లా ఎస్పీ బి.రాజకుమారి ట్రాఫిక్ కానిస్టేబులు తాళ్ళపూడి అప్పలనాయుడును జిల్లా పోలీసు కార్యాలయంకు పిలిపించి,అభినందించి, ప్రశంసా పత్రాన్ని, నగదు పురస్కారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు సేవలను అభినందించారు.

## ఇళ్ల ఆవరణలో ప్రతీ ఒక్కరూ రెండు మొక్కలు నాటాలి : జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్



విజయనగరం : పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ కోసం ప్రతీ ఒక్కరూ రెండు మొక్కలు తమ ఇళ్ల ఆవరణలో నాటాలని జిల్లా కలెక్టర్, కార్పొరేషన్ ప్రత్యేకాధికారి డా.ఎం.హరి జవహర్‌లాల్ పిలుపునిచ్చారు. హరిత విజయ నగరం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గుమ్చి రోడ్డు డివైడర్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ మాట్లాడుతూ హరిత విజయనగరంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను బాధ్యతగా పరిరక్షిం చాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రాణ వాయువును అందించే మొక్కలను పెంచడానికి ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. ఇళ్ల ఆవరణలో మొక్కలు పెంచేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఒక్కరికీ ఉచితంగా మొక్కలను పంపిణీ చేస్తు న్నామన్నారు. నేడు నాటే మొక్కలు భావి తరాలకు ఎంతగానో ఉపయోగపడతాయని వివరించారు.

పట్టణంలోని అయ్యకోనేరు ప్రాంతాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ కార్యక్రమంలో కమి షనర్ ఎస్.ఎస్.వర్మ, అసిస్టెంట్ కమిషనర్ కనకమహాలక్ష్మి, ఎంహెచ్ఓ డా.ప్రణీత, డిఇ అప్పారావు తదితరులు నిర్వహిస్తున్నారు.

## జాతీయ పతాక రూపశిల్పి పింగళివెంకయ్య చిరస్మరణీయులు




విజయనగరం : జాతీయ పతాక రూపశిల్పి స్వర్గీయ పింగళి వెంకయ్య భారత జాతీయపతాకం రూపొందించి ప్రపంచ చిత్రపటంలో చిరస్థాయిగా నిలిచారని ప్రముఖ విద్యావేత్త డా॥ పి.వి.ఆర్.సుబ్బారావు శ్లాఘించారు. శుక్రవారం స్థానిక కోట ఆవరణలో జయంతి స్మారక జిల్లా గ్రంధాలయ సేవాసంఘం పట్టణశాఖ అధ్వర్యంలో సంఘ అధ్యక్షులు మజ్జి కాంతారావు అధ్యక్షతన పింగళి వెంకయ్య 143వ జయంతి కార్యక్రమాన్ని విద్యార్థుల మధ్య జరిగిన కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడారు.మనదేశంలో ఎందరో చరిత్ర పురుషులున్నప్పటికి అతికొద్దిమంది మాత్రమే విశ్వవ్యాప్తి గుర్తింపు పొందారన్నారు. పింగళి వెంకయ్య అందులో ఒకరు అన్నారు. విద్యావేత్తగా, దేశభక్తునిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. డా॥ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవిత చరిత్రను బావితరాలయిన విద్యార్థులు మార్గదర్శంగా తీసుకోవా లన్నారు. విద్యార్థులు వాతావరణ సమతుల్యానికి మొక్కలు పెంపకంద్వారా పచ్చదనానికి కృషిచేయాలన్నారు. సాహితీవేత్త దవళ సర్వేశ్వరరావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య రూపొందించిన జాతీయ పతాకం దేశ ప్రజలంతా గౌరవ వందనం చేస్తుంటే ఆయన కీర్తి అనంతమైనదన్నారు.సంస్థ జిల్లా అధ్యక్షులు రొంగలి పోతన్న మాట్లాడుతూ తమ సంస్థద్వారా విద్యార్థులలో చైతన్యం కల్గిస్తూ వారికి దేశభక్తుల జీవిత చరిత్రలు తెలియజేస్తూ విద్యార్థులలో నైతిక విలువలు పెంచేటందుకు కృషిచేస్తున్నామన్నారు. సభాధ్యక్షులు మజ్జి కాంతారావు మాట్లాడుతూ పింగళి వెంకయ్య జీవిత ఘట్టాలను విద్యార్థులకు అవగాహన కల్పించేటందుకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తూ విషయ పరిజ్ఞానం కలిగిన ప్రముఖులచే విద్యార్థులకు ప్రసంగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా వ్యాసరచన పోటీలలో విజేతలయిన విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం జరిగింది. అనంతరం డా॥ పి.వి.ఎల్.సుబ్బారావును సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి షేక్ గౌస్‌బాసా, చుక్క మోహన్‌రావు, శారదా ప్రసాద్, గంగా ప్రసాద్, భైరవబట్ల తదితరులు పాల్గొన్నారు.

## కామాక్షి ఆలయంలో శ్రావణ మాసం పూజలు ప్రారంభం

విజయనగరం : స్థానిక బొండాడ వీధిక్ష వేంచేసియున్న శ్రీకంచి కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రావణ మాసం ఉత్సవాలు ..ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు గంగాధర్ కుంకుమార్చనలు జరిపారు. ఆలయ చైర్మన్ అప్పలభక్తుల సోమ రాజు ఆధ్వర్యంలో ఉత్సవాల విశేసాల వివరాలు ఆవిష్కరించారు. ప్రతిశుక్రవారం మహిళలచే సామాహిక కుంకు మార్చనలు, లలితాసహస్ర పారాయణం, భక్తిరంజని కార్యకమాలుం టాయనిశ్రీనివాస్, శశిభూషన్ తెలిపారు.

## రేషన్ డీలర్‌పై కేసు నమోదు



రేషన్ షాప్‌ను తనిఖీ చేయడానికి వచ్చిన సిఎస్‌డిటి రాజ్యలక్ష్మి

గొలుగొండ : మండలంలో గుండుపాల పంచాయతీ శివారు జి.కొత్తూరు రేషన్ దుకాణంపై స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఎస్‌డిటి రాజ్యలక్ష్మి శుక్రవారం దాడులు నిర్వహించి డీలర్‌పై కేసు నమోదు చేశారు. రేషన్ దుకాణంలో రెండు తూనిక యంత్రాలను వినియోగించడం, లబ్ధిదారులకు ఇస్తున్న బియ్యం పరిమాణం కన్నా తక్కువగా ఉండడాన్ని గుర్తించిన డీలర్ అప్పలనాయుడుపై కేసు నమోదు చేశారు.

ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సరుకుల పంపిణీలో డీలరు అప్పలనాయుడు లబ్ధిదారులకు పరిమాణం తగ్గి ఇస్తున్నాడని, రేషన్ దుకాణంలో రెండు యంత్రాలను వినియోగించి లబ్ధిదారులను మోసం చేస్తున్నాడని తమకు వచ్చిన ఫిర్యాదు మేరకు రేషన్ దుకాణాలపై దాడులు నిర్వహించామన్నారు. లబ్ధిదారులకు ఇస్తున్న బియ్యం కొలతలలో అక్రమాలు గుర్తించి ఆయనపై కేసు నమోదు చేసి షాప్‌ను సీజ్ చేస్తున్నామని అని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింగరావు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదుకు షెడ్యూల్ విడుదల

శ్రీకాకుళం : ప్రత్యేక ఓటరు నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు అవకాశం కల్పిస్తూ షెడ్యూల్ ప్రకటించారు. సార్వత్రిక ఎన్నికల తరవాత తొలిసారిగా ప్రత్యేక ఓటరు నమోదుకు చర్యలు చేపడుతున్నారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలంటే వెబ్‌సైట్‌తో పాటు బీఎల్‌వోలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద దరఖాస్తులు చేసుకోవాలి. ఈ నెల నుంచి 31వ తేదీ వరకు ఇందుకు అవకాశముంటుంది. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటా సర్వేలోనూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశముంటుంది.

# సిపిఎస్ రద్దుపై ఉపసంఘ ఏర్పాటుపై హర్షం



అచ్యుతాపురం : రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి సిపిఎస్ రద్దుపై నలుగురు మంత్రులతో కూడిన ఉపసంఘశీ ఏర్పాటుపై ఏపిటిఎఫ్ మరియు ఏపిసిపిఎస్ సి ఏ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాధస్వామి మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వెంటనె సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరణ చేస్తానన్న మాటతో అధికారంలోకి రాగనే సిపిఎస్ రద్దుపై ఉపసంఘశీ ఏర్పాటు పై హర్షం వ్యక్తం చెస్తూ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపిసిపిఎస్ సి ఏ మండల అద్యక్షులు పట్నాల నాగేశ్వరరావు ,ఏపిటిఎఫ్ మండల అద్యక్షులు వెంకటేశ్వరరావు ,,ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పాతిమా మోబిన్ బేగం ,సరళాదేవి ,నక్క అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# రఘు ఇనిస్టిట్యూట్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం

భీమునిపట్నం: భీమిలి మండలం దాకమర్రి లో ఉన్న రఘు ఇన్స్టిట్యూట్ లో సైన్స్ విభాగం ఆద్వర్యంలో ఎ ఐ సి టి ఇ ద్వారా అప్రూవల్ పొందిన ఫ్యాకల్టీ డేవలప మెంట్ ప్రొగ్రామ్ ని శుక్రవారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమం రెండు వారలు పాటు జరుగుతాదని కళాశాల ప్రిన్సి పాల్ డాక్టర్ సత్యనారాయణ తెలిపారు. మొదటి రోజు క్లౌడ్ ఆదారిత సేవలు మరియు అమెజాన్ వెబ్ సర్వీసు ద్వారా వెబ్ సర్విస్ నిర్వహణ తదితర అంశాలపై అద్యాపకులు పలు సందేశాలు నివృతి చేశారు.

ఈ కార్యక్రమం కి బాపట్ల ఇంజినేరింగ్ కళాశాల నుంచి డాక్టర్ ఎస్ రామకృష్ణ, రఘు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ కామేశ్వర రావు,కళాశాల అద్యాప కులు పాల్గొన్నారు.

# విద్యార్థుల బస్సు పాసులు పంపిణీ



భీమునిపట్నం: స్థానిక పండిట్ జవహర్ లాల్ నెహ్రు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సుమారు 100 మంది కి ఉచిత బస్ పాస్ లు రాష్ట్ర విశ్వబ్రాహ్మన అధ్యక్షురాలు గోడి.అరుణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన తెలుగుదేశం పార్టీ డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు మరియు ఎ.పి.ఎస్. ఆర్.టి.సి.వాల్తేరు డిపో మేనేజర్ గంగాధర్ చేతులమీదుగా ఈ బస్ పాసులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్ లు ఇచ్చివారికి,వారి తల్లిదండ్రులకు సహకారం అందిస్తున్న రాష్ట్ర విశ్వబ్రాహ్మన అధ్యక్షురాలు గోడి.అరుణను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నవిద్యార్థులకు ఈ విధమైన సహాయం చేస్తే తల్లిదండ్రులకు కూడా పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే భావన ఏర్పడుతుందని గంటా.నూకరాజు తెలియజేసారు. ఆర్.టి.సి. సూపర్ వైజర్ మురళిని గంటా.నూకరాజు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో నెహ్రు స్కూల్ ప్రధానోపాధ్యాయిలు దత్తి. ఈశ్వర రావు, టిడిపి నాయకులు గిడుతూరి.శ్రీనివాసరావు, కె.ఎస్.ఆర్.కృష్ణారావు, కందుల సుందర రావు , వియ్యపు.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలు మర్చొద్దు అంటూ ఆర్టీసీ కార్మికులు ధర్నా




సింహాచలం: కేంద్రప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం కలిగించి, కార్పొరేట్ లకు లాభం చేకూర్చే విధంగా కార్మిక చట్టాలను మార్పు చేస్తున్నది. దీనిని ఎస్ డబ్ల్యు ఎఫ్ తీవ్రంగా ఖండిస్తుంది.అలాగే మోటార్ వాహనాల చట్ట సవరణ బిల్లు వలన డ్రైవరు లకు తీవ్రమైన జరిమానాలు,శిక్షలు ఉన్నాయి. ఈ బిల్లు డ్రైవర్లు కు ఉరితాడు వంటిది.అంతే కాక =ుజ లు నాశనం అవుతాయి.అదే విదంగా విద్యుత్ బస్సుల పేరుతో భారీ ఆర్టీసీ ల ప్రైవీటీకరణ దిశగా అడుగులు వేస్తుంది.ఆ విద్యుత్ బస్సులు ప్రయివేటు కన్సార్టియం కి కాకుండా ఆర్టీసీయే స్వంతంగా నడుపుకోవడానికి అవకాశం ఇవ్వాలని, అదేవిధంగా వర్క్ షాపులను కుదింపుచర్యలను ఆపాలని.... ప్రభుత్వ ఈ వినాశకర విధానాలకు వ్యతిరేకంగా, ఈరోజు అనగా 02-8-2019శుక్రవారం మధ్యాహ్నం ఎస్ డబ్ల్యు ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సింహాచలం డిపో వద్ద డిపో ప్రెసిడెంట్ కేజేపీ రావు గారి ఆధ్వర్యంలో జుఖ మరియు హైర్ బస్సు యూనియన్ లతో కలసి జీూజ గా దర్నా చేయడమైంది. ధర్నా లో ఎస్ డబ్ల్యు ఎఫ్ కార్యదర్శి ఈ వి ఎన్ రాజు, జుఖ కార్యదర్శి జి పి ఎస్ టి నాయుడు , హైర్ బస్సు యూనియన్ కార్యదర్శి నరసింగరావు, హరిప్రసాద్, యస్ వి కుమార్ ఎన్ రాములు తదితరులు పాల్గొనడం జరిగింది

# గోడపత్రిక ఆవిష్కరణ



భీమునిపట్నం: పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ వైజాగ్ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 11న విశాఖ స్టీల్ ప్లాంట్ నందు ప్రతిభాపురస్కారాలు నిర్వహించ నున్నట్లు తగరపువలస డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొప్పల రమేష్ తెలిపారు. దీనికి సంబంధించిన గోడపత్రిక ను శుక్రవారం ఆవిష్కరించారు.

2019 లో పదవతరగతి, ఇంటర్, 9.5 పైగా వచ్చిన వారు, నీట్, ఐఐటి, మెడిసిన్ లో ప్రవేశం పొందిన పద్మశాలి విద్యార్థులకు నగదు,మెమెంటో,ప్రశంసాపత్రం ,రాత పుస్తకాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

అర్హత గల వారు ఆగస్టు 6వతేదీ లోపుగా 9885652588,7799445522 నంబర్లు ను సంప్రదించాలనీ ఆయన కోరారు. సెంట్రల్ కమిటీ మెంబర్స్ కొప్పల ప్రభావతి,చిక్కా సత్యనారాయణ, సెక్రటరీ రాపర్తి సుబ్బారావు, కొప్పల రమేష్,,కోసూరి రాంబాబు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# బిజేపి పార్టీ సభ్యత్వ నమోదు



భీమునిపట్నం: భీమిలి మండలం చేపలుప్పడ పంచాయతీ జంక్షన్ వద్ద భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోని నాగరాజు ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బీజేవైఎం నేషనల్ కార్యవర్గ సభ్యులు, సురేంద్రమోహన్,లు హాజరు అయ్యారు. సుమారు వంద మంది జాయిన్ అయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి భీమిలి రూరల్ మండల అధ్యక్షులు వాసుపల్లి భోడియ్య, బిజెపి ఎస్సీ మోర్చ జిల్లా వైస్ ప్రెసిడెంట్ సంజీవ రావు, బిజెపి జిల్లా సెక్రెటరీ వాడుపల్లి శ్రీహరి, బిజెపి సభ్యులు మహేష్ , రాజు , నవీన్ , అనిల్ , మహిళలు బొడ్డు కొండ , ఉమ్మిడి లక్ష్మి పాల్గొన్నారు..

# పర్యావరణాన్ని పరిరక్షించాలి



విశాఖపట్నం: భారత్ వికాస్ పరిషత్ విశాఖ నగర శాఖ మరియు యలయెన్స్ నార్త్ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ దరి మహాత్మగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినాము. ఈ కార్యక్రమానికి అతిధులుగా భారత్ వికాస్ పరిషత్ జాతీయస్థాయి ఉపాధ్యక్షులు రమేష్‌చంద్ జైన్, యలయెన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ బి.ఎస్. మాణిక్యంలు హాజరై మొక్కలు నాటారు. అనంతరం వారు ప్రసంగిస్తూ మనకి ప్రాణవాయువునిచ్చే మొక్కలను అధికసంఖ్యలో నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవా లన్నారు. వేలాది సంఖ్యలో మొక్కలు నాటి సంరక్షించగలిగితే కాలుష్యం బారి నుండి కాపాడుకోగలమని హితవు పలికారు. గౌరవ అతిధులుగా మహాత్మగాంధీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వి.లక్ష్మణ్, బి.వి.పి. రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకాయల సన్యాసిరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.వి. రాజశేఖర్, బి.వి.పి దక్షిణ ప్రాంత కార్యదర్శి ఎం.వి.వి. సత్యనారాయణ, పి.టి.మాస్టారు కె.రవికుమార్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ ప్రతినిధులు, యలయెన్స్ కార్యదర్శి చంద్రశేఖర్, యలయెన్స్ కోశాధికారి జె.లక్ష్మణరావు, యలయెన్స్ డి.సి.పి. సిహెచ్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


# సామాన్యమానవునికి ప్రభుత్వ ఫలాలు అందాలి

శ్రీకాకుళం: సామాన్యమానవునికి ప్రభుత్వ ఫలాలు అందించడానికి గ్రామ వాలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, అందులో భాగంగానే శిక్షకులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.చక్రధరరావు పేర్కొన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ప్రారంభించబడిన రెండు రోజులు శిక్షకులకు శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ శాఖలు నుండి ప్రతి మండలానికి 6 మందిని శిక్షకులను ఎంపిక చేసి రెండు రోజులు శిక్షణ ఇవ్వడం జరుగు తుందని చెప్పారు. మిగతా మండలాల్లో గ్రామ వాలంటీర్లకు శిక్షణ ఏవిధంగా ఇవ్వాలన్నది ఇందులో నేర్పడం జరుగుతుందని చెప్పారు. మీరు గ్రామ వాలంటీర్లు ద్వారా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నవరత్నాలు ప్రజలు ఎలా లబ్దిపొందాలో తెలియజేయ వలసి ఉందని అన్నారు. ఏ శాఖ ద్వారా నవరత్న పధకాలు అమలు చేస్తున్నది మీరు ముందుగా తెలుసుకోవల్సి ఉందన్నారు. గ్రామ సచివాలయానికి, పంచాయితీకి 50 హౌస్ హోల్డ్స్ కి వాలంటీర్లు అనుసంధానంగా ఉంటారని తెలిపారు. 50 హౌస్ హోల్డ్స్ ఒక యూనిట్గా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మీరు పొందుతున్న శిక్షణలో సందేహాలు ఉంటే వెంటనే అడిగి తెలుసుకోవాలని, ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ముందుగా సి.ఇ.ఓ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇ.ఓ.ఆర్.డి వెంకటరాజు పర్ ప్రెజెంటేషన్ ద్వారా నిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉప కార్యనిర్వహణ అధికారి ప్రభావతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కె.జి.హెచ్‌లో చికిత్స పొందుతూ నవజాత శిశువు మృతి

**- శిశివు మృతి విషయం తెలుసుకుని గుండెనొప్పితో తాతకు తీవ్ర అస్వస్థత**

**- విశాఖ ఆసుపత్రికి తరలింపు, గజపతినగరంలో విషాదంలో కుటుంబ సభ్యులు**



చోడవరం: మండలంలోని గజపతినగరం గ్రామానికి చెందిన బయ్యవరపు మాధురికి పుట్టిన నవజాత(ఆడ) శిశువు విశాఖపట్నం కె.జి.హెచ్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. పుట్టిన వెంటనే శిశువు తీవ్ర అనారోగ్యానికి గురవడంతో శిశువు తల్లి యొక్క తండ్రి పొట్ల అప్పారావు గుండె నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరాడు. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బయ్యవరపు ముత్యాలనాయుడుతో అదే గ్రామానికి చెందిన మాధురికి గత మూడేళ్ళ క్రితం వివాహమయింది. మాధురి గర్భం దాల్చడంతో అనకాపల్లి ఎన్.టి.ఆర్, ఆసుపత్రిలో వైద్య తనిఖీలు చేయిస్తున్నారు. గత నెల 28న మాధురికి పురిటి నొప్పులు రావడంతో ఎన్.టి.ఆర్.ఆసుపత్రిలో చేర్పించగా, 31 బుధవారం ఉదయం సాధారణ ప్రసవం అయింది. అయితే కాన్పు సమయంలో బిడ్డ ఉమ్మినీరు తాగడం వలన శిశువు పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో విశాఖ కె.జి.హెచ్.కు తరలించాలని ఇక్కడి డాక్టర్లు సూచించడంతో వెంటనే ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా, శుక్రవారం తెల్లవారుజాము సమయంలో శిశువు మృతి చెందింది. శిశువు పరిస్థితి తెలుసుకున్న మాధురి తండ్రి పొట్ల అప్పారావు తీవ్ర ఆందోళనకు గురవడంతో షుగర్ లెవెల్ బాగా పెరిగి గుండెపోటు వచ్చి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ప్రస్తుతం అప్పారావు విశాఖలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీంతో బాధిత కుటుంబంలోను, గ్రామంలోను తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.



**వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందిందంటూ తల్లిదండ్రుల ఆరోపణ**

అనకాపల్లి ఎన్.టి.ఆర్.ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే తమకు పట్టిన బిడ్డ మృతి చెందిందని, బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. మాధురి గర్భం దాల్చిన నాటి నుంచి ఇక్కడి ఆసుపత్రిలోనే తనిఖీలు చేయించుకుంటుందని, వచ్చిన ప్రతిసారి బిడ్డ ఆరోగ్యంగానే ఉందని డాక్టర్లు చెప్పేవారని, ప్రసవం సమయంలో వైద్య సిబ్బంది జాప్యం, నిర్లక్ష్యం కారణంగానే శిశువు ఉమ్మనీరు తాగడంతో పరిస్థితి విషమించిందని శిశువు తల్లిదండ్రులు ముత్యాలనాయుడు, మాధురీ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# భారతీయ నృత్య కళలను ప్రోత్సహించాలి

## - సిద్ధేశ్వరానంద భారతీస్వామి



విశాఖపట్నం: తెలుగువారి సాంస్కృతిక సాంప్రదాయాలకు నిలువుటద్దమయిన కూచిపూడి నృత్యం ద్వారా దేశంలోని 108 శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాల్లో అష్టోత్తర శత నృత్య సంగీతార్చన పేరిట నాట్య పరిమళ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ తలపెట్టిన కార్యక్రమాలలో భాగంగా 28వ ప్రదర్శన అక్కయ్యపాలెం లలితపీఠంలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి వారి సన్నిధికి సమీపాన గల కళావేదికపై నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన, అన్నమాచార్య సంకీర్తన అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా కుర్తాళం పీఠాధిపతి జగద్గురువు శ్రీశ్రీశ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి హాజరై జ్యోతిని వెలిగించి సాంస్కృతిక ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం సిద్ధేశ్వరానంద భారతీస్వామి భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ మన సనాతన సాంప్రదాయానికి సంబంధించిన ఆధ్యాత్మిక నృత్య కళలుగా శోభిల్లుతున్న భారతీయ నృత్య కళలను ప్రోత్సహించాలన్నారు. మన భారతదేశ వైభవాన్ని చాటి చెబుతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించి వారి ఉన్నతికి ప్రతి ఒక్కరు చేయూతనివ్వాలని తెలిపారు. ఈ మంచి కార్యక్రమం చేపట్టిన కళాకారిణి కె.లిపికారెడ్డిని ప్రశంశించి విచ్చేసిన భక్తులందరికి మంగళాశాసనములు కృపచేశారు. నృత్య దర్శకురాలు కె.లిపికారెడ్డి నృత్య దర్శకత్వంలో 25 మంది చిన్నారులు కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించి అన్నమాచార్య సంకీర్తనలు గానం చేసి సభికుల మన్ననలను పొందారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ పై కార్యక్రమానికి వ్యాఖ్యానం చేసి సభను రంజింపచేశారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, శ్రీలలితాపీఠం కార్యదర్శి డా॥ వి.నరసింహమూర్తి, మేనేజర్ ఎం.కృష్ణసీన్, పీఠం ప్రతినిధులు, సంస్థ ప్రతినిధులు అధికసంఖ్యలో కళాభిమానులు, కళాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు.ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తశతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు. పూజా కార్యక్రమాలు చల్లపల్లి .ప్రసాద్, వెంకట్రావు, శర్మ,కోంపెల్ల. మూర్తికుచిబోట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు,అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవో ఎం.వి.సురేష్ బాబు,చైర్మెన్ ఐ.వి.రోహిత్ మరియు విశాఖపట్నానికి చెందిన సీఎంఆర్ సంస్థ అధినేత మావూరి.వెంకటరమణ, పద్మావతి దంపతులు మరియు,ఆలయ సిబ్బంది, గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందజేసారు.

# అఖిల భారతీయ విద్యాపరిషత్ ఆద్వర్యంలో జూనియర్ కళాశాల కమిటీలు




భీమునిపట్నం: అఖిల భారతీయ విద్యా పరిషత్ (ఎ.బి.వి.పి) జిల్లా కన్వీనర్ లోడగల అచ్చిబాబు ఆద్వర్యంలో శుక్రవారం భీమిలి జూనియర్ కళాశాల కమిటీలు వేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్దులలొ దేశభక్తిని నింపి విద్యార్థుల సమస్యల పై నిరంతరం రాజీ లేని పోరాటాలు (ఎ. బి వి పి) చేస్తుందని తెలిపారు. భీమిలి జూనియర్ కళాశాలలో కమిటిని వేసారు. ప్రేసిడెంట్ గా ఎస్. సాయి కళ్యాణ్ , సెక్రెటరీగా బి బంగారు బాబు , కాలేజి కన్వీనర్ గా సి.హెచ్ సంగీత , లను నియమించామని నగర ప్రేసిడేంట్ నరసింగ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లొడగల. అచ్చిబాబు, కళ్యాణ్, మాదవ్, చిన్న రవి తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌కు

# సొంత గనులు కేటాయించాలి

### లోక్ సభలో గళమెత్తిన విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



న్యూఢిల్లీ : విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. లోక్ సభలో జీరో అవర్‌లో ఆయన స్పీకర్ ఓం బిర్లా ముందు స్టీల్ ప్లాంట్ సమస్యలపై గళమెత్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ లో 22,266 ఎకరాల విస్తీర్ణంలో 1971 లో స్థాపించబడ్డ స్టీల్ ప్లాంట్ వార్షికంగా 7.2 మిలియన్ టన్నుల ఉత్పత్తితో అగ్రగామిగా నిలిచిందన్నారు . ఈ నేపథ్యంలో సొంత ముడిఖనిజం స్టీల్ ప్లాంట్ కు అవసరమన్నారు.

ఇదే విషయంపై స్టీల్ ప్లాంట్ అధికారులు ,ఒడిశా మినిరల్ డెవలప్ మెంట్ కు సొంతగనుల కేటాయింపుకై రాసిన లేఖ లో విషయాన్ని ప్రస్తావించారు. ఈ విషయాన్ని తమ ద్వారా ప్రధాన మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి మైనింగ్ మంత్రి ద్వారా త్వరిత గతిన ఈ విషయం పై సానుకూలంగా స్పందించాలని ఎంపీ గారు అభ్యర్థించారు.

**కేజీ హెచ్ , టెర్షరీ కాన్సర్ కేర్ భవనంలో సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించండి**

**హెల్త్ సర్వీసెస్ డైరక్టర్ జనరల్‌కు ఎంవీవీ వినతి**

ఉత్తరాంధ్రుల ఆరోగ్యప్రదాయిని అయిన కింగ్ జార్జిఆసుపత్రిలో ఉన్న కాన్సర్కేర్ భవనంలో ఆధునిక వైద్య సదుపాయాల కల్పన, పరికరాల కొనుగోలుకు నిధులు కేటాయించాలని విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కోరారు. ఈ మేరకు ఆయన న్యూఢిల్లీలో హెల్త్ సర్వీసెస్ డైరక్టర్ జనరల్ అశోక్ సక్సేనా ను కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎంవీవీ, కాన్సర్ భాదితుల అవసరార్థమై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య 2018 లో జరిగిన ఎంఓయూ మేరకు సీఎస్ ఆర్ నిధులతో ఈ సెంటర్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ రావడం జరిగిందన్నారు.

తదుపరి బిల్డింగ్ నిర్మాణం పూర్తవడం కూడా జరిగిందన్నారు. అయితే నాటి నుంచి, నేటివరకూ ఏవిధమైన వైద్యసేవలు అక్కడ ప్రారంభం కాలేదనీ, సరైన వైద్య పరికరాలు తమకు అందుబాటులో లేవన్న విషయం ఏఎంసీ ప్రిన్సుల్ డా.సుధాకర్ గతంలో తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ విషయం పై తాము డి.జి. హెచ్.ఎస్ ని కలవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా తక్షణ వైద్య సేవలు ప్రారంభించేందుకు అనుగుణంగా వైద్యపరికరాల ఏర్పాటుకు నిధులు కేటాయించాలని ఆయన్ని కోరామన్నారు. తమ వినతిని స్వీకరించిన అశోక్ సక్సేనా సానుకూలంగా స్పందించి, నిధుల ఏర్పాటుకు కృషిచేస్తానని హామీనిచ్చారని ఈ సందర్భంగా ఎంపీ స్పష్టంచేసారు.

# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసిన అవంతి



భీమునిపట్నం: స్థానిక బ్యాంకు కోలని శివానందగురు ఆశ్రమంలో రాష్ట్ర చీఫ్ సెక్రెటరీ ఎల్ వి సుబ్రమణ్యంను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు మర్యాద పూర్వకముగా కలిసి ఆయనని సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డిసిసిబి ఉపాధ్యక్షుడు సుంకరి గిరిబాబు, మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ బొండా నరసింహమూర్తి, స్థానిక వై.కా.పా. నాయకులు ఎం.షణ్ముఖరావు, జీరు వెంకట రెడ్డి, గుండాసు మధు నాయుడు, రాకోతు నరసింగరావు, అవంతీ పి.ఎ. చంద్రశేఖర్, వాసుపల్లి కొండబాబు, అల్లిపిల్లి నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా శ్రీ సత్యదేవుని ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- **అంగరంగ వైభవంగా స్వామివారి జయంతి వేడుకలు**
- **ఘనంగా జరిగిన స్వామివారి ఫలపుష్ప సేవ**
- **ప్రత్యేక ఆకర్షణగా 500 కేజీల లడ్డూ ప్రసాదం**




అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం రత్నగిరి వాసుడైన శ్రీ సత్యదేవుని 129వ దినోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా శుక్రవారం జరిగాయి.ముందుగా శుక్రవారం తెల్లవారుజామున సుప్రభాతం, శ్రీ స్వామివారి జయంతి సందర్భంగా శ్రీ స్వామివారి, అమ్మవార్లకు ఋత్వికులు, అర్చక, పండిత, పురోహితుల నేతృత్వంలో ప్రధాన గర్భాలయంలోని స్వామి మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక పంచామృతాభిషేకాలు నిర్వహించారు.అనంతరం ఉదయం స్వామి, అమ్మవార్లను వెండి రథంపై వేంచేపు చేసి ప్రధాన ఆలయం చుట్టూ ఊరేగించి ప్రాకారసేవ అనంతరం ఆయుష్య హోమ పూర్ణాహుతి ,పండిత సత్కారములు నిర్వహించారు.

**వేడుకగా రాత్రి ఫలపుష్ప సేవ**

వివిధ రకాల ఫలాలు, పుష్పాల సోయగాల మధ్య సత్యదేవుడు,అనంతలక్ష్మీ అమ్మవారితో ఆశీనులైన కమనీయ దృశ్యాన్ని చూసిన భక్తజనం పులకరించారు. స్వామివారి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా దేవస్థానంలో స్వామివారి నిత్య కళ్యాణ మండపం నందు ఫలపుష్పసేవ ను శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంలో సుందరంగా తీర్చిదిద్దిన వేదికపై స్వామి,అమ్మవార్లను ఆశీనులను చేశారు. అర్చకులు,పండితులు, పురోహితుల బృందం ఆధ్వర్యంలో ముందుగా ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం పంచహారతులు, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎం.వి.సురేష్ బాబు, చైర్మెన్ ఐ.వి.రోహిత్, ఏసి రమేష్ బాబు, పిఆర్వో తులా రాముడు, ఏఈవోలు ఎం.కె.టి.వి.కె. ప్రసాద్, బండారు సత్యవతి అనంత లక్ష్మి దేవి సూపరింటెండెంట్స్ అనకాపల్లి ప్రసాద్, కోటమర్తి సతీష్, గొల్లు సత్యనారాయణ, టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి లక్ష్మీనారాయణ మరియు దేవస్థానం అధికారులు సిబ్బంది అధిక సంఖ్యలో భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్థానిక ఎస్సై మురళీమోహన్ తగిన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

# నా దగ్గర ఎటువంటి ఆయుధము లేదు

- **ఎవరిపైనా దాడి చేయలేదు**
- **నాకు రాజకీయాలతో సంబంధం లేదు**
- **మా స్థలాన్ని కబ్జా చేయడానికి తప్పుడు ఫిర్యాదు చేశారు**
- **జరిగిన విషయంపై కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాను**
- **హేమ ఎబోడ్స్ యం.డీ. బి.సురేష్ కుమార్**



డాబాగార్డెన్స్ : నా స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు కబ్జాదారులు గురువారం మధ్యాహ్నం నిర్మాణంలో ఉన్న నా అపార్టమెంట్ పడమర ప్రక్కన సరిహద్దు గోడ కూల్చివేసి తిరిగి నాపై కంచరపాలెం పోలీసులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని హేమ ఎబోడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బి. సురేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక హెూటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సురేష్ కుమార్ మాట్లాడుతూ 2006 నుంచి 2014 సంవత్సరాల్లో ఐదు వేల చదరపు గజాలను సనపల కన్నబాబు మరియు అన్నపూర్ణ కుటుంబం నుండి కొనుగోలు చేసినట్లు తెలిపారు. సనపల బంగార్రాజు, కళ్యాణ్ కుమార్ చౌదరి స్థలాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నించి గురువారం మధ్యాహ్నం అపార్ట్‌మెంట్ ప్రహరీ గోడను కూల్చి వేశారు. వెంటనే మేము నెం. 100కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. పోలీసులకు సమాచారం తెలిపామన్న విషయం తెలుసుకున్న ఆక్రమణదారులు అక్కడ నుండి పారిపోయినట్టు ఆయన తెలిపారు. ఈ విషయంలో సంబంధం లేని ఎస్. శ్రీనివాసు సాయంత్రం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వారిని తుపాకీతో బెదిరించి దౌర్జన్యం చేసినట్టు తనపై తప్పుడు ఫిర్యాదు చేశారు అని సురేష్ కుమార్ తెలిపారు. నా దగ్గర ఉన్న లైసెన్స్ గన్ 2011లో పోలీసులకు అప్పగించడం జరిగిందని తెలిపారు.

దానిని ఇప్పటి వరకు తీసుకోలేదని అన్నారు. నాకు ఎటువంటి రాజకీయ నాయకులతో సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. బంగార్రాజు , కళ్యాణ్ కుమార్ చౌదరి నేను కొనుగోలు చేసిన దానిని కబ్జా చేయాలని, నా కంపెనీకి చెడ్డ పేరు తీసుకురావాలని కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నా స్థలానికి హద్దుగాగల రోడ్డు, కాలువలు జివిఎంసి వారికి చెందినవని, అయితే దానిని కొందరు వ్యక్తులు కబ్జా చేయాలని చూస్తున్నారని సురేష్ కుమార్ ఆరోపించారు. కాబట్టి జివిఎంసి కమిషనర్ స్పందించి రోడ్డు వేసి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

## అభిమానులను దిల్ ఖుష్ చేసిన కోహ్లీ

***వీడియో పోస్టు చేసిన బీసీసీఐ***

మియామి: టీమిండియా కెప్టెన్ విరాట్‌కోహ్లీ అభిమానులను సంతోషపెట్టాడు. వెస్టిండీస్‌తో టీ20 సందర్భంగా ఫ్లోరిడాలోని సెంట్రల్ బ్రోవార్డ్ రీజనల్ పార్క్ స్టేడియం టర్ఫ్ గ్రౌండ్‌లో భారత క్రికెట్ జట్టు ప్రాక్టీస్ మొదలు పెట్టింది. దీంతో అభిమానులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. ఆ సమయంలో గ్యాలరీలో నిల్చున్న అభిమానుల వద్దకు వెళ్లిన కోహ్లీ.. వారికి ఆటోగ్రాఫ్‌లు ఇవ్వడంతో పాటు చిన్నారులతో కలిసి ఫొటోలు దిగాడు. తమ ఫేవరెట్ ఆటగాడిని కలవడం ద్వారా అభిమానులు సంతోషపడ్డారు.

# యువత నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలి

### గీతంలో నౌకాదళ అధికారి కమాండోర్ సుశాంత్ ధామ్



సాగర్‌నగర్ః యువతరం జీవితంలో లక్ష్యాలను చేరడానికి ప్రణాళికతో పాటు నాయకత్వ లక్షణాలను పెంచుకోవాలని నౌకాదళ అధికారి కమాండోర్ సుశాంత్ ధామ్ పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయాలను, అపజయాలను సమానంగా స్వీకరిస్తూ అపజయాల నుంచి కొత్త పాఠాలను నేర్చుకోవాలన్నారు. అత్యంత ప్రతికూల వాతావరణంలో సహితం నౌకాదళం సముద్రంపై దేశరక్షణకోసం ఎలా ధైర్యంగా ముందుకు సాగుతుందో ఆయన వివరించారు. ఇటీవల చంద్రయాన్-2ను విజయవంతంగా ముందుకు నడిపించడంలో ఇస్రో శాస్త్రవేత్తలు ఎంతగా శ్రమించింది ఆయన వివరించారు. భారత నౌకాదళం యువతకు కల్పిస్తున్న అవకాశాలను వివరించారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.తమ్మిరెడ్డి అద్యక్షత వహించారు.

# వెండి మండపం చేయించుకున్న చిరు



ఆదోని: మెగాస్టార్ చిరంజీవి ప్రత్యేకంగా ఓ వెండి మండపాన్ని తయారు చేయించుకున్నారు.

కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో కంచిగారి వీధిలో ఉన్న రంగణ్ణచారి సన్స్ అండ్ మెటల్ వర్క్స్‌లో దీనిని తయారు చేయమని ఆర్డర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గత కొన్నిరోజుల నుంచి తయారు చేసిన వెండి మండపాన్ని గురువారం హైదరాబాద్‌లో చిరంజీవికి అప్పగించారు. చిరు ప్రస్తుతం సైరా నరసింహారెడ్డి సినిమా షుటింగ్‌తో బిజీగా ఉన్న సంగతి తెలిసిందే.

# దేవదాస్ కనకాల కన్నుమూత

### పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో తొలితరం నటుడు

### తీవ్ర దిగ్భ్రాంతికి గురైన సినీ పరిశ్రమ

## ప్రముఖుల సంతాపం



హైదరాబాద్: ప్రముఖ సినీ నటుడు, నటనా శిక్షకుడు దేవదాస్ కనకాల కన్నుమూశారు. అనారోగ్యంతో కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆయన శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 74 ఏళ్లు. దేవదాస్ కనకాల 1945లో జులై 30న యానాంలో జన్మించారు. ఆయన స్వగ్రామం యానాం శివారులోని కనకాల పేట. పుణె ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యనభ్యసించిన తొలితరం నటుడైన దేవదాసు కనకాల అనంతరం.. నటనా శిక్షణా సంస్థను నెలకొల్పారు. ఆయన తండ్రి కనకాల తాతయ్య నాయుడు యానాం ఫ్రెంచి పరిపాలనలో ఉన్నప్పుడు యానాం ఎమ్మెల్యేగా పనిచేశారు. తల్లి మహాలక్ష్మమ్మ. సిరిసిరి మువ్వ, గోరింటాకు, మంచుపల్లకి, గ్యాంగ్‌లీడర్ వంటి అనేక చిత్రాల్లో దేవదాస్ నటించారు. చివరగా భరత్ అనే నేను చిత్రంలో ఆయన నటించారు. ప్రముఖ నటులు రజనీకాంత్, చిరంజీవి, రాజేంద్ర ప్రసాద్, శుభలేఖ సుధాకర్, భానుచందర్, రఘువరన్, నాజర్, తదితర ఎంతో మందిని దేవదాస్ వద్దే శిక్షణ పొందారు. అలాంటి మరెందరినో నటులుగా తీర్చిదిద్ది తెలుగు సినీ పరిశ్రమకు అందించిన ఆయనది సినీ ప్రస్థానంలో ఓ ప్రత్యేక అధ్యాయం. ఆయన కుమారుడు రాజీవ్ కనకాల, కోడలు సుమ చిత్ర పరిశ్రమలో ఎంతో గుర్తింపు సంపాదించారు. ఇటీవల దేవదాస్ సతీమణి మృతిచెందడం ఆయనను ఎంతో కలిచివేసింది. దీంతో ఆయన ఇంటికే పరిమితమయ్యారు.

అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు రాజీవ్ కనకాల వెల్లడించారు. దేవదాస్ కనకాల మృతిపట్ల సినీ పరిశ్రమ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఆయన మరణవార్త తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, పలువురు సినీ నటులు కొండాపూర్‌లోని కిమ్స్ ఆస్పత్రి వద్దకు చేరుకుంటున్నారు.




VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ★ Phone : 2564353, Fax : 0891-2569004 ★ e-mail: vijayabhanudaily@gmail.com